

కేకే లైనులో రైళ్ల పునరుద్ధరణ

» నేటి నుంచి యథా విధిగా రాకపోకలు

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేకే (కొత్తవలస-కిరండూల్) లైనులో గురువారం నుంచి రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయని విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సాంకేతిక కారణాలతో కొన్ని రోజులుగా రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతోపాటు గమ్యాలు కుదించిన విషయం తెలిసిందే. గురువారం నుంచి కిరండూల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18516), విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501), ఆగస్టు ఒకటి నుంచి కిరండూల్-విశాఖ పాసింజర్ (58502) రైళ్లు యథావిధిగా తిరుగుతాయన్నారు.

మరోసారి భూ సమీకరణ

విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో ల్యాండ్ పూలింగ్

- 1,941.19 ఎకరాలు లక్ష్యం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- వీఎంఆర్‌డీఏకు అప్పగించాలని ఆదేశం
- అసైన్డ్ పట్టా ఉంటే ఎకరానికి 900 గజాలు
- ఆక్రమణదారులైతే ఎకరానికి 450 గజాలు అభివృద్ధి చేసిన భూమి ఇవ్వాలని నిర్ణయం



వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేయనున్న చెర్లోపలి ఖండం లేఅవుట్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో మరోసారి ల్యాండ్ పూలింగ్ (భూ సమీకరణ) చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మూడు జిల్లాల్లో 1,941.19 ఎకరాలు సమీకరించాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖలో 'ఫ్యూచర్ సిటీ' కోసం వీటిని వినియోగిస్తారు. పేదలు, బలహీన వర్గాల గృహ నిర్మాణానికి ఉపయోగిస్తారు.

రాష్ట్ర ప్రభుత్వం అటు అమరావతి, ఇటు విశాఖపట్నంలలో ల్యాండ్ పూలింగ్‌పై దృష్టిపెట్టింది. పేదలకు గతంలో ఇచ్చిన అసైన్డ్ భూములను, ప్రభుత్వ భూములను ఆక్రమించి రైతులు సాగు చేసుకుంటున్న భూములను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. భవిష్యత్తులో భూముల ... మిగతా 8వ పేజీలో

అనకాపల్లి జిల్లాలో 783.69 ఎకరాలు

- సబ్బవరం మండలం అంతకాపల్లిలో 175.42 ఎకరాలు
- బాటజంగాలపాలెంలో 141.01 ఎకరాలు
- ఎ.సిరసపల్లిలో 371.75 ఎకరాలు
- నల్లరేగుడిపాలెంలో 27.37 ఎకరాలు
- పైడివాడ అగ్రహారంలో 28.14 ఎకరాలు
- అనకాపల్లి మండలం తగరంపూడిలో 40 ఎకరాలు

విశాఖపట్నం జిల్లాలో 1,132.09 ఎకరాలు

- ఆనందపురం మండలం గిడిజాల సర్వే నంబరు 258లో 309.18 ఎకరాలు
- గోరింట సర్వే నంబరు 108లో 198.31 ఎకరాలు
- శొంఠ్యాం సర్వే నంబరు 347/పిలో 251.55 ఎకరాలు
- బీడీ పాలెం సర్వే నంబరు 1 లో 122.53 ఎకరాలు
- పద్మనాభం మండలం కొవ్వాడ సర్వే నంబరు 237లో 250.52 ఎకరాలు

విజయనగరం జిల్లాలో 25.41 ఎకరాలు

- డెంకాడలో సర్వే నంబర్లు 241, 242, 243లలో 20.41 ఎకరాలు.
- భోగాపురం మండలం రావాడ సర్వే నంబరు 64/1లో 5 ఎకరాలు.

చెర్లోపలి రైతులు ఖుషీ!

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో లేఅవుట్ అభివృద్ధికి ప్రభుత్వ ఆమోదం

- గతంలో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి
- ఎకరాకు 1,800 గజాల చొప్పున లేఅవుట్‌లో రైతులకు ప్లాట్లు
- రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం
- భూములు ఇచ్చిన రైతుల్లో ఆనందం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి పట్టణంలో ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు సమీపంలో చెర్లోపలి ఖండంలోని విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) లేవుట్ అభివృద్ధికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పంద ప్రకారం ఎకరాకు 1,800 గజాల అభివృద్ధి చేసిన స్థలాలను రైతులకు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ఉత్తర్వులతో ఆయా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి పట్టణంలోని మార్కెట్ యార్డుకు సమీపంలో వున్న చెర్లోపలి ఖండంలోని రైతుల నుంచి భూములు సమీకరించి, లేఅవుట్‌గా అభివృద్ధి చేయాలని 2007లో అప్పటి విశాఖ పట్టణాభివృద్ధి సంస్థ (వుడా) అధికారులు భావించారు. వివిధ సర్వే నంబర్లలో 58.18 ఎకరాలకు సంబంధించి రైతులతో మాట్లాడి, భూ సమీకరణకు ఒప్పించారు. లేఅవుట్‌గా అభివృద్ధి చేసిన తరువాత ఎకరాకు 1,800 గజాల చొప్పున స్థలాలు ఇస్తామని అధికారులు చెప్పగా, రైతులు అంగీకరించారు. తరువాత ... మిగతా 8వ పేజీలో

అన్నదాత దిగాలు

మొహం చాటేసిన వర్షాలు

- వేసవిని తలపించేలా మండుతున్న ఎండలు
- జూలై ముగుస్తున్నా.. చెరువుల్లో చేరని నీరు
- దమ్ము చేయడానికి వీలుకాని పరిస్థితి
- ఆకు మడుల్లో ఎండిపోతున్న వరి నారు
- దిక్కుతోచని స్థితిలో 'రావికమతం' రైతులు



చుక్క నీరు లేని గుమ్మాళ్లపాడు పారమ్మ చెరువు

రావికమతం, జూలై 30 (ఆంధ్రజ్యోతి):

వరినాట్లు వేయాల్సిన సమయానికి వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పొలాలను దమ్ము చేయాల్సిన ప్రస్తుత తరుణంలో ఇందుకు భిన్నంగా వేసవిని తలపించేలా ఎండ మండిపోతున్నది. జూలై నెల ముగుస్తున్నప్పటికీ మండలంలోని చెరువుల్లో కనీసస్థాయిలో కూడా నీరు చేరలేదు. దీంతో ఆయా చెరువులను ఆధారంగా చేసుకుని వరి సాగు చేసే రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



చినపాచిలలో ఎదుగుదల లోపించి ఎండిపోతున్న వరినారు

రావికమతం మండలంలో కల్యాణపులోవ రిజర్వాయర్ కింద సుమారు నాలుగున్నర వేల ఎకరాల ఆయకట్టు వుంది. ఏటా ఆగస్టు మొదటి పక్షంలో ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తుంటారు. కానీ ఈ ఏడాది పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు పడకపోవడంతో జలాశయంలోకి ఆశాజనకంగా నీరు చేరలేదు. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా ప్రస్తుతం 451 అడుగులు మాత్రమే వుంది. ఈ నీరు సగం ఆయకట్టుకు దమ్ము పనులు చేయడానికే సరిపోతుందన్న ఉద్దేశంతో కాలువలకు నీటి విడుదలను అధికారులు వాయిదా వేశారు. ఆగస్టు 15వ తేదీ తరువాతే నీటిని విడుదల చేస్తామని చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితిని ఊహించని రైతులు.. ఏటా మాదిరిగానే ఈ నెల మొదటివారంలో వరి ఆకుమడులు పోశారు. ప్రస్తుతం నారు అందుబాటులోకి వచ్చినప్పటికీ కాలువలకు నీటిని విడుదల చేయకపోవడం, మరోవైపు వర్షాలు లేకపోవడంతో పొలాలను దమ్ము చేయడానికి వీలుకాని పరిస్థితి నెలకొంది. వరినాట్లు వేయడం ఆలస్యమైతే.. నారు ముదిరిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇదిలావుండగా మాడుగుల మండలం పెద్దేరు జలాశయం కింద రావికమతం మండలంలో ఎనిమిది వేల ఎకరాల ఆయకట్టు వుంది. కాలువల తవ్వకంలో లోపాలు, నిర్వహణ సరిగా ... మిగతా 8వ పేజీలో

అభివృద్ధి, సంక్షేమానికి సముచిత ప్రాధాన్యం

మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు

హోం మంత్రి వంగలపూడి అనిత

- కూటమి ప్రభుత్వంపై జగన్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజం
- 'పేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి సముచిత ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పి.ఎల్.పురం మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ దేవర సత్యనారాయణ, వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, ఇతర సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వైసీపీ హయాంలో వ్యవసాయ మార్కెట్ యార్డులు నిర్వీర్యం అయ్యాయని ధ్వజమెత్తారు. గతంలో తాను ఎమ్మెల్యేగా వున్నప్పుడే పాయకరావుపేటకు కొత్తగా మార్కెట్ యార్డు మంజూరు చేయించానని గుర్తు చేశారు. ఇక్కడ కోల్డ్‌స్టోరేజీ, గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

వైసీపీ అధికారంలో వున్నప్పుడు ఆ పార్టీ నేతలు పాల్పడిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, ప్రజాధనాన్ని లూటీ చేసిన వారు జైలుకు వెళుతున్నారని మంత్రి అనిత అన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదంటూ వైసీపీ అధినేత జగన్‌రెడ్డి దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. ఆర్థికంగా ఇబ్బందులు వున్నప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం, మత్స్యకార భరోసా, పింఛన్ల పెంపు వంటి వాటిని అమలు చేశామన్నారు. ఆగస్టు రెండో తేదీన ... మిగతా 8వ పేజీలో

ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

పారిశుధ్యాన్ని మెరుగు పరచాలి

- ప్రసూతి వార్డులో స్నానాలకు వేడి నీటి సదుపాయం
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- కలెక్టర్‌తో కలిసి లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ప్రారంభం



లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ను ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయకృష్ణన్, కౌన్సిలర్ పద్మావతి

నర్సీపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఏరియా ఆస్పత్రికి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో వితరణ చేసిన లైఫ్ సపోర్టు అంబులెన్స్‌ను బుధవారం కలెక్టర్ విజయకృష్ణన్, కౌన్సిలర్ చింతకాయల పద్మావతితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ఆస్పత్రి నిర్వహణలో మరిన్ని మార్పులు తీసుకువస్తామని అన్నారు. పారిశుధ్యాన్ని మెరుగు పరచాల్సిన అవసరం ఉందని చెప్పారు. 16 మంది సెక్యూరిటీ గార్డులు ఉన్నప్పటికీ విధులు సరిగా నిర్వహించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ చేసిన వాహనాలు చోరీకి గురవుతున్నాయని, ఇకపై ఇటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. గతంతోపోలిస్తే ఆస్పత్రి నిర్వహణ 80 శాతం మెరుగు పడిందని, మిగిలిన 20 శాతం కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. ఆస్పత్రి ప్రసూతి వార్డులో స్నానాలకు వేడినీటి సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఆపరేషన్ థియేటర్‌లో సెంట్రల్ ఆక్సిజన్ వ్యవస్థను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. అధికారులు, వైద్యులు సమన్వయంతో పనిచేస్తూ ఆస్పత్రికి రాష్ట్రస్థాయిలో అవార్డులు సాధించాలని అన్నారు. మరమ్మతులకు గురైన అంబులెన్స్‌ను ఆగస్టు 15 నాటికి బాగుచేయించి అందుబాటులోకి తీసుకురావాలని మెడికల్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ హెచ్ఆర్ హెడ్ బి.పాత్ర, డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, ఆర్డీవో వీవీ రమణ, కమిషనర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు

సెజ్ భూముల్లో గ్రావెల్ దందా

- పూడి, లాలంకోడూరు గ్రామాల పరిధిలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు



లాలంకోడూరు వద్ద ఏపీఐఐసీ భూమిలో గ్రావెల్ తవ్వకాలు

రాంబిల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆర్థిక మండలి కోసం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు మరింత బరితెగిస్తున్నారు. సెజ్‌లో కొత్తగా నిర్మించే కంపెనీలు, రహదారుల నిర్మాణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్తగా వేస్తున్న ఇళ్ల స్థలాల లేఅవుట్లకు గ్రావెల్ అవసరం ఏర్పడింది. దీంతో ఏపీఐఐసీ భూములపై అక్రమార్కుల కన్ను పడింది. పూడి గ్రామ ... మిగతా 8వ పేజీలో

ఫార్మాసిటీలో వ్యర్థాల గుట్టలు

అనుమతులు లేకుండా టన్నుల కొద్దీ నిల్వ

- పరిసర ప్రాంతాల భూగర్భ జలాలు కలుషితం
- ప్రాజెక్టు నిర్వహణలో నిబంధనలు బేఖాతరు
- గ్రీన్ ట్రైబ్యునల్‌లో ప్రజా సంఘాల కేసు
- ఈ నెలలోనే నాలుగుసార్లు పీసీబీ తనిఖీలు
- వివరణ కోరుతూ నోటీసులు జారీ



అనుమతులు లేకుండా నిల్వ చేసిన వ్యర్థాల గుట్ట


(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పరవాడలో రాంకీ ఫార్మా సిటీ యాజమాన్యం నిబంధనలను ఉల్లంఘించి పారిశ్రామిక వ్యర్థాలను టన్నుల కొద్దీ నిల్వ చేస్తోంది. వాటి నుంచి బయటకు వచ్చే రసాయనాలు పరిసర ప్రాంతాల వ్యవసాయ భూముల్లో చేరి భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు హెచ్చరించినా యాజమాన్యం ఖాతరు చేయకుండా ప్రజల ప్రాణాలతో ఆటలాడుతోంది.

ఫార్మా సిటీలో వ్యర్థాల నిర్వహణకు 'కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు' నడుపుతున్నారు. పరిశ్రమల నుంచి వ్యర్థాలను సేకరించి, శుద్ధి చేశాక భద్రంగా నిల్వ చేసి, ఆ తరువాత వాటిని అక్కడి నుంచి దూర ప్రాంతాలకు తరలించాలి. ఇందు కోసం 18.07 ఎకరాలను కేటాయించారు. అందులో 9.11 ఎకరాల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ ఫిల్ (వ్యర్థాలు నిల్వ చేయడానికి)కు అనుమతి ఇచ్చింది. మిగిలిన 8.96 ఎకరాలకు యాజమాన్య హక్కుల విషయంలో వివాదాలు ఉండడంతో నోటిఫై చేయలేదు. రెండు దశాబ్దాలు గడిచినా ఆ వివాదం పరిష్కారం కాలేదు. అయినా ఫార్మా సిటీ యాజమాన్యం మొత్తం 18.07 ఎకరాలను వాడుకుంటోంది. అందులో ఇప్పటివరకూ 17,20,55 టన్నుల వ్యర్థాలను నిల్వ చేసింది. పరిమితి దాటి పోయింది. ఆ వ్యర్థాలను వేరే ప్రాంతాలకు ... మిగతా 8వ పేజీలో

ముఖ హాజరు తప్పనిసరి

- ఫేషియల్ అటెండెన్స్ వేయని 21 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు
- డీఈవో అప్పారావునాయుడు



పాఠశాలలో ఇంటర్నెట్ రౌటర్‌ను పరిశీలిస్తున్న డీఈవో జి.అప్పారావు నాయుడు

నర్సీపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు రెండు పూటలా హాజరు తప్పని సరి అని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) జి.అప్పారావునాయుడు తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మెయిన్)లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, వరుసగా ఐదు రోజులపాటు ఫేషియల్ అటెండెన్స్ (ముఖ హాజరు) వేయని 21 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని చెప్పారు. నాతవరం మండలంలో ఫేషియల్ అటెండెన్స్ వేయడానికి సిగ్నల్స్ సమస్య ఉందని పది మంది ఉపాధ్యాయులు చెప్పారని, ఆయా పాఠశాలలకు సమీపంలో నెట్ సిగ్నల్స్ వచ్చే ప్రదేశాన్ని గుర్తించి మ్యాపింగ్ చేశామని చెప్పారు. పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న 4జీ స్థానంలో 5జీ సిమ్‌తో రౌటర్లు ఇస్తామని చెప్పారు. నాడు-నేడు పెండింగ్ పనులపై పాఠశాలల వారీగా వివరాలను ప్రభుత్వానికి పంపినట్టు డీఈవో చెప్పారు. ఉపాధ్యాయులకు విద్యా బోధన మినహా ఇతర పనులు అప్పగించవద్దని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

'జనవాణి'కి 149 అర్జీలు

- జడ్పీ అతిథి గృహంలో స్వీకరించిన కమిషనర్
- కొక్కిరాపల్లిని మునిసిపాలిటీ నుంచి తొలగించి పంచాయతీగా గుర్తించాలని కౌన్సిలర్ వినతి



జనవాణిలో వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ రామకృష్ణ

ఎలమంచిలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ అతిథి గృహంలో బుధవారం అధికారులు జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ హాజరు కాకపోవడంతో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది విచ్చేసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కమిషనర్ పలువురితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. శాఖల వారీగా పంపి వాటి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. ఉదయం ప్రారంభమై ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి 149 మంది విచ్చేసి అర్జీలను అందజేశారు. ఇదిలావుంటే, ఎలమంచిలి మునిసిపాలిటీలోని 23వ వార్డు నుంచి కొక్కిరాపల్లిని తొలగించి పంచాయతీగా విభజన చేసేలా గురువారం జరగనున్న కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ వినతి పత్రాన్ని అందజేశారు.

జగన్‌ను కలిసిన ధర్మశ్రీ, అమర్



జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కరణం ధర్మశ్రీ

ఎలమంచిలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త కరణం ధర్మశ్రీ బుధవారం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వంగా కలిశారు. నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారిగా ఆయనను కలవడంతో సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్టు ధర్మశ్రీ ఇక్కడి విలేకరులకు తెలియజేశారు.

'విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి'

అచ్యుతాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : గృహావసరాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను అంతా అడ్డుకోవాలని ఐద్వా మండల కన్వీనర్ ఆర్.లక్ష్మి, సీఐటీయూ మండల కన్వీనర్ కె.సోమునాయుడు పిలుపునిచ్చారు. మోసయ్యపేటలో బుధవారం ఇంటింటికీ వెళ్లి ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఇప్పటికే షాపులకు ఈ మీటర్లు బిగించడం వల్ల అధికంగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయన్నారు. వీటిని అంతా వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.అమృత, ఎం.సరోజిని, కె.లక్ష్మి, కె.కాసులమ్మ, ఎం.వనజ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీకి ఉప్పు గల్లీల భూమి బదలాయింపు తగదు

- ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా ఎలా చేస్తారు?
- ఇప్పటికే పూడిమడక చుట్టూ కాలుష్యకారక కర్మాగారాలు
- అవస్థలు పడుతున్నా పట్టించుకునేవారు కరువు
- డిప్యూటీ తహసీల్దార్ వద్ద మత్స్యకార నాయకులు ఆవేదన



డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్‌కుమార్‌కి వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

అచ్యుతాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా ఉప్పు గల్లీల భూములను ఏపీఐఐసీకి బదలాయించడం తగదని మత్స్యకార నాయకులు వాపోయారు. ఈ మేరకు డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్‌కుమార్‌ను బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూడిమడక సర్వే నంబరు 113లో 45.48, సర్వే నంబరు 139లో 120.67 ఎకరాలు మొత్తం 166.15 ఎకరాల ప్రభుత్వ భూముల్లో ఉప్పు గల్లీలు ఉండేవన్నారు. వీటిని అనుకొనే ఉప్పుటేరు ఉందన్నారు. ఉప్పుటేరు ద్వారా వచ్చే నీటితో ఉప్పు మడుల్లో ఉప్పు పండించడంతో పాటు ఉప్పుటేరులో చేపల వేట కూడా కొనసాగించి జీవనం సాగించేవారన్నారు. అయితే ఎవరికీ తెలియకుండా ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించారన్నారు. ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయిస్తున్నట్టు ఈనెల తొమ్మిదో తేదీన ఎవరికీ తెలియకుండా పంచాయతీ కార్యాలయంలో నోటీసు అంటించి దండోరా వేయకుండా భూ బదలాయింపు చేశారని వీరు ఆరోపించారు. జిల్లాలో అతిపెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడక చుట్టూ ఇప్పటికే కాలుష్యకారక కర్మాగారాలతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో దండోరా వేయించి ప్రజాభిప్రాయసేకరణ చేయాలని డీటీని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు చోడిపల్లి అప్పారావు, వాసుపల్లి శ్రీనివాస రావు, మేరుగు చిన రాజులు, ఉమ్మిడి అప్పారావు, మేరుగు రమణ బాబు, సూరా పోలయ్య, మేరుగు వసంత రావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మలాడ రోడ్డు మరమ్మతుకు కూటమి కంకణం



నిధులను సమకూర్చుకుని రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కూటమి నేతలు

మునగపాక, జూలై 30(ఆంధ్రజ్యోతి) : ఉమ్మలాడ గ్రామంలో రోడ్డు మరమ్మతులకు కూటమి నాయకులు కంకణం కట్టుకున్నారు. దశాబ్దాల కాలంగా మెయిన్‌రోడ్డు నుంచి గ్రామ ప్రధాన ద్వారం వరకు గల రోడ్డు గోతులమయంగా మారడంతో రాకపోకలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్లలో దీనిపై వైసీపీ పాలకుల వద్ద పదేపదే మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో జనసేన పార్టీ నాయకుడు మొల్లేటి ఆనంద్‌కుమార్ పలువురు కూటమి నాయకులతో కలిసి రోడ్డు మరమ్మతు పనులకు అవసరమైన నగదును సమకూర్చారు. దీంతో రోడ్డు పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, మొల్లేటి నారాయణరావు, శివాజీ, జగదీశ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

'జింక్ సల్ఫేట్‌తో నారుమడిలో లోపాల నివారణ'



ఒంపోలులో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

మునగపాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నారుమడిలో లోపాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా జలవనరుల కేంద్రం ఏఈ పి.విజేత సూచించారు. మండలంలోని ఒంపోలులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. నారుమడిలో జింక్ లోపం ఉంటే రెండు శాతం జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలన్నారు. జీవన ఎరువులు పచ్చి రొట్టనిచ్చే జీలుగ, జనుము భూమిలో కలియదున్నాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నకుమారి, ఏఈ, వీఏఏలు పాల్గొన్నారు.



లాలంకోడూరు వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయాధికారిణి సుమంత

లాలంకోడూరు, గోవిందపాలెంలలో..

రాంబిల్లి : మండలంలోని లాలంకోడూరు, గోవిందపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోందని కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత మాట్లాడుతూ కొబ్బరి, జీడి తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు కొబ్బరి, జీడి మొక్కలకు జింక్, బోరాన్ వేయడం వలన పూత, పిందె రాలడాన్ని అరికట్టవచ్చునన్నారు. కొబ్బరి తోటలు మధ్య పచ్చిరొట్ట పంటలే కాకుండా ఇరవై రకాల విత్తనాలతో కూడిన ఎండీఎస్ కిట్టులను వేయడం ద్వారా భూసారం పెరగుతుందన్నారు. అపరాలు, నువ్వులు వంటి పంటలు సాగుచేయడం ద్వారా అదనంగా దిగుబడి వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ అనీల్, రైతులు పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

ఎలమంచిలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం జరగనుందని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. ఉదయం పదకొండు గంటలకు కార్యాలయం ఆవరణలో చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో చేట్టిన అభివృద్ధి పనులపై చర్చ, చేపట్టాల్సిన వాటిపై తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొనాల్సిందిగా కోరారు.

'అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం'



పథకాల కరపత్రాలు అందిస్తున్న నాయకులు

ఎలమంచిలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని 14వ వార్డులో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు బొద్దపు శ్రీను, కరణం రవికుమార్ బుధవారం పర్యటించారు. ఇం టింటికీ వెళ్లి కూటమి ఏడాది పాలనలో సాధించిన విజయాలను వివరించారు. అభి వృద్ధి, సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యమని స్పష్టం చేసింది. ప్రజలంతా ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. అనంతరం పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గుర్రాల రాము, స్థానిక నాయకులు అందే రమణ, ఎస్.రాజామహేష్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపుతో ఆర్థిక స్వావలంబన

అచ్యుతాపురంరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పొదుపు ద్వారా ఆర్థిక స్వావలంబ సాధించవచ్చునని బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ ఎస్.విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో జరిగిన జనమిత్ర సొసైటీ 30వ ప్రాతినిధ్య మహాజన సభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. తిమ్మరాజుపేట ప్రధాన కేంద్రంగా జనమిత్ర పరస్పర సహకార పొదుపు సంఘం 10వేల మంది సభ్యులతో రూ.40 కోట్ల టర్నోవర్ చేస్తున్నట్టు ప్రశంసించారు. అనంతరం జనమైత్రి రైతు ఉత్పత్తిదారుల సంస్థను ప్రారంభించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు కర్రి సీతారాం జనమిత్ర సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్‌పర్సన్ కరణం కాంతమ్మ, సీఈవో కర్రి రమేష్, మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సంస్థ మేనేజర్ ఐఆర్‌వీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొరుప్రోలు, పెదగుమ్ములూరు సబ్ స్టేషన్ల పరిధిలోని అడ్డురోడ్డు తిమ్మాపురంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ ఈఈ ఓ ప్రకటనలో తెలిపారు. పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

బల్క్ డ్రగ్ పార్కుపై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయండి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం
- రాజయ్యపేటలో మత్స్యకారుల ఆందోళన



రాజయ్యపేటలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయవద్దని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజయ్యపేట గ్రామంలో బుధవారం మత్స్యకారులతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ప్రజలు, మత్స్యకారులు వ్యతిరేకిస్తున్న బల్క్ డ్రగ్ పార్కు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశించారు.

రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం, మత్స్యకారుల జీవనోపాధి లెక్కలేకుండా పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తూ మత్స్యకారులను ప్రభుత్వం తీవ్రంగా దగా చేస్తోందని ఆరోపించారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, మత్స్యకారుల జీవనోపాధికి నష్టం కలిగించే బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. అదే విధంగా ఆగస్టు 6వ తేదీన నక్కపల్లిలో జరుపతలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేశ్, నాయకులు ఎం.మహేష్‌బాబు, జి.సోమేశ్వరరావు, ఎరిపిల్లి నాగేష్, పిక్కి తాతీలు, కోడ కాశీరావు, సిహెచ్.కాశీ, బి.అప్పలరాజు, నరేశ్, సంజీవ్‌తో పాటు అధిక సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు.

చురుగ్గా తాండవ మేజర్ కాలువ అభివృద్ధి పనులు



తాండవ మేజర్ కాలువ పనులు జరుగుతున్న దృశ్యం

కోటవురట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తాండవ మేజర్ కాలువ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొత్తూరు నుంచి పాములవాక వచ్చే కాలువ మధ్యలో రూ.16 లక్షలతో రెండు అండర్ టన్నెల్ మరమ్మతు పనులు చేపడుతున్నారు. నాతవరం మండలంలోని చెర్లోపాలెం నుంచి కోటవురట్ల మండలం కొత్తూరు మీదుగా పాములవాక వచ్చే తాండవ కాలువకు మధ్యలో కొండగెడ్డ నుంచి వచ్చే వరద నీరు వల్ల కాలువ దెబ్బతినే ప్రమాదం ఉంది. ఆ నీరు కాలువలోకి వెళ్లకుండా కింద నుంచి పోయే విధంగా తాండవ ప్రాజక్టు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ పనుల కోసం రూ.16 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతోతాండవ ప్రాజెక్టు ఏఈ శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో కాలువ అండర్ టన్నెల్ పనులు జోరుగా జరుగుతున్నాయి. అలాగే తాండవ కాలువలో పూడికతీత పనుల కోసం మరో రూ.8 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో 17 కిలోమీటర్ల పొడవునా కాలువలో పూడికతీత పనులను చేపడుతున్నారు. ఈ పనులు టీడీపీ నాయకులు వేచలపు భాస్కరరావు, చిటికెల సత్యనారాయణ. సిహెచ్‌సీ డెవలప్‌మెంట్ కమిటీ డైరెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు.

సీబీఎస్ఈ క్లస్టర్-7 వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన శ్రీప్రకాష్ విద్యార్థులు

పాయకరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 వాలీబాల్ పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించారు. బుధవారం ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి వెండి పతకాలు సాధించారని విద్యా సంస్థల యాజమాన్యం తెలిపింది. కాగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు కోచ్ దుర్గాప్రసాద్‌ను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, వైఎస్ ప్రిన్సిపాల్ అపర్ణ, తల్లిదండ్రులు విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు.

పాటి కాలువ ఆక్రమణలు తొలగించండి

- వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపట్నం వద్ద ఉన్న పాటి కాలువ ఆక్రమణలు పూర్తిగా తొలగించి ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం పాయకరావుపేటలో తహశీల్దారు ఎస్ఏ.మహేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోపాలపట్నంలో అనుమతి లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తున్నవారు రోజూ ఖాళీ గాజు సీసాలు, చెత్తను గ్రామంలో పాటికాలువలో పడేస్తున్నారని చెప్పారు. దీంతో కొద్ది రోజులుగా పాటి కాలువలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్, ఖాళీ మద్యం సీసాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి, డెబ్రిస్‌ను కాలువ గట్టుపై వదిలివేశారన్నారు. దీనివల్ల కాలువ దాటి పొలాలకు వెళ్లే రైతులకు పగిలిన మద్యం సీసాల గాజు ముక్కలు గుచ్చుకుంటున్నాయన్నారు. అలాగే గ్రామంలో పాటికాలువ చాలావరకు ఆక్రమణపాలవగా, కేవలం ఒక వ్యక్తికి సంబంధించి కక్ష కట్టినట్టుగా కాలువ గట్టుపై మొక్కలను తొలగించారన్నారు. ఇప్పటికైనా పాటి కాలువను సర్వే చేయించి పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించాలని, మద్యం బెల్టు షాపులను ఎత్తివేయాలని కోరారు.

దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ పాటి కాలువ సర్వే చేయించి ఆక్రమణలు పూర్తిగా తొలగించడంతో పాటు బెల్టు షాపులను తొలగించేలా పోలీసులకు సూచనలు ఇస్తామన్నారు. పాటి కాలువ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, సర్పంచ్ పన్నీరు బాబ్జీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించొద్దు

- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు

ఎస్.రాయవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించొద్దని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు కోరారు. మండలంలో పలు పాఠశాలలను బుధవారం సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఆగస్టు రెండో తేదీన నిర్వహించే జిల్లా స్థాయి ధర్నాలో ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ధర్మారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సునీల్, కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ గోవిందరావు, సభ్యులు రమేశ్, సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, సింహాలచం తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించాలి

- పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొప్పిశెట్టి బుజ్జి



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొప్పిశెట్టి బుజ్జి

నక్కపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన దిగుబడులు సాధించాలని పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొప్పిశెట్టి బుజ్జి సూచించారు. మండలంలోని ఉపమాక గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ, బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం రాయితీపై విత్తనాలు, ఎరువులు అందజేస్తోందని చెప్పారు. అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతీ రైతుకు నగదు బదిలీ పథకం త్వరలో ప్రాంభంకాబోతున్నందున రైతులు తమ వివరాలను వ్యవసాయ శాఖ ద్వారా జరిగిన నమోదును సమీక్షించుకోవాలన్నారు. బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేశ్వరరావు మాట్లాడుతూ వరి నారుమడిలో అక్కడక్కడ పాముపొడ తెగులు ఆశించినట్టు గమనించామని, నివారణకు హెక్సాకొనజోల్ మందు పది లీటర్ల నీటికి 20 మిల్లీలీటర్ల మందు చొప్పున కలిపి నారుమడి తడిసేలా పిచికారీ చేయాలని చెప్పారు. అంతకుముందు గ్రామంలో వ్యవసాయ భూములను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.ఉమాప్రసాద్, స్థానిక నాయకులు కొండబాబు, వీరబాబు, శ్రీను, సత్యనారాయణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపమాక ఆలయంలో కుంకుమ పూజలు

నక్కపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపమాక కల్కి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని గోదాదేవి అమ్మవారి సన్నిధిలో బుధవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు పి.వెంకటశేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు మూలవిరాట్ అమ్మవారికి, ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గెడ్డపాలెంలో 'పొలం పిలుస్తోంది..'

ఎస్.రాయవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో సౌజన్య వరి పొలాలను సందర్శించారు. నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించాలని, ముదురు నారును నాటితే దిగుబడి తగ్గుతుందని ఈ సందర్భంగా ఏవో చెప్పారు. ముదురు నాట్లు వేసేటప్పుడు కుదుళ్ల సంఖ్య పెంచి దగ్గరగా నాటాలన్నారు. నాట్లు వేసిన తరువాత ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల బాటలు తీయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తన్నీరు ఎరకయ్య, ఉద్యానవన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సరుగుడు తోట వేలం రసాభాస

- అయ్యన్నపాలెం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన అధికారులు
- పాట డబ్బులు ఎల్లుప్పి పంచాయతీకి ఇవ్వాలని సదరు గ్రామస్థులు పట్టు
- ఏ గ్రామ పరిధిలో చెరువు ఉంటే ఫలసాయం ఆ పంచాయతీకే చెందుతుందని ఈవోపీఆర్‌డీ వెల్లడి
- అభ్యంతరం తెలిపిన ఎల్లుప్పి, మర్రిపాలెం రైతులు
- వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడి
- సిబ్బందితో సీఐ రామచంద్రరావు రంగ ప్రవేశం
- చివరకు వచ్చే నెల13కు వేలం పాట వాయిదా


అయ్యన్నపాలెంలో సరుగుడు తోట వేలం పాటను అడ్డుకుంటున్న ఎల్లుప్పి రైతులు

సబ్బవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యన్నపాలెంలో గల భూదేవి చెరువు గర్భంలో గల సరుగుడు తోటకు బుధవారం నిర్వహించిన వేలం పాటలో ఆయకట్టు రైతుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఇదికాస్త ముదరడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. పరిస్థితిని అదుపుచేసినా కొందరు రైతులు తిరుగుబాటు చేయడంతో చివరకు చేసేది లేక అధికారులు వేలం పాటను వాయిదా వేశారు. ఈ ఘటనకు సంబంధించి ఈవోపీఆర్‌డీ చైతన్య, సర్పంచ్ బుదిరెడ్ల శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు తెలిపిన వివరాలివి. అయ్యన్నపాలెం భూదేవి చెరువు కింద అయ్యన్నపాలెంతో పాటు గుల్లేపల్లి, ఎల్లుప్పి శివారు మర్రిపాలెం రైతుల ఆయకట్టు ఉంది. భూదేవి చెరువు గర్భంలో ఖాళీగా ఉన్న భూమిలో ఎనిమిదేళ్ల క్రితం ఉపాధి హామీ పథకం నిధులతో అటవీ అధికారులు సరుగుడు మొక్కలను వేశారు. ప్రస్తుతం సరుగుడు తోట పెరిగి కోతకు వచ్చింది. ఈ నేపథ్యంలో అయ్యన్నపాలెం పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, ఇతర అధికారులు సరుగుడు తోటకు వేలం పాట నిర్వహించారు. అయితే ఎల్లుప్పి శివారు మర్రిపాలేనికి చెందిన కొందరు రైతులు వేలం పాటను అడ్డుకున్నారు. వేలం పాట ద్వారా వచ్చిన సొమ్మును ఎల్లుప్పి పంచాయతీకి ఇవ్వాలని పట్టుబట్టారు. లేనిపక్షంలో వేలం పాటను అడ్డుకుంటామ స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం ఏ గ్రామ పరిధిలో చెరువు ఉంటే ఫలసాయం ఆ గ్రామ పంచాయతీకి చెందుతుందని ఈవోపీఆర్‌డీ తెలిపారు. అధికారుల సమాధానంతో ఎల్లుప్పి, మర్రిపాలెం రైతులు ఏకీభవించకపోవడంతో వివాదం మొదలైంది. అయ్యన్నపాలెం రైతులు, ఎల్లుప్పి, మర్రిపాలెం రైతులు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడికి తెగబడ్డారు. అధికారులను దుర్భషలాడారు. దీంతో ఆందోళన చెందిన అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ జి.రామచంద్రరావు సిబ్బందితో వచ్చి పరిస్థితిని అదుపు చేశారు. చివరకు చేసేది లేక వేలం పాటను ఆగస్టు 13కు వాయిదా వేస్తున్నట్టు ఈవోపీఆర్‌డీ ప్రకటించారు. గట్టిబందోబస్తు నడుమ ఆ రోజున వేలం పాట నిర్వహిస్తామన్నారు. అయ్యన్నపాలెంలో అధికారికంగా నిర్వహిస్తున్న వేలం పాటను అడ్డుకుని తనను, ఇతర సిబ్బందిని దుర్భాషలాడిన ఎల్లుప్పి, మర్రిపాలేనికి చెందిన తుంపాల శివ, చిన రాము, కోటేశ్వరరావు, పొంతపల్లి అప్పలరాజు, బల్లెన చంద్రరావు, ఉగ్గిన నాయుడు తదితరులపై ఉన్నతాధికారులతో చర్చించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఈవోపీఆర్‌డీ తెలిపారు. కాగా, గతంలో ఎల్లుప్పి, మర్రిపాలెం గ్రామాలకు ఫలసాయం ఇచ్చేవారని, ఇప్పుడూ అదే ఆనవాయితీని కొనసాగించాలని ఆయా గ్రామాల రైతులు పలువురు కోరారు. అయితే అప్పట్లో ఏం జరిగిందో తమకు తెలియదని, నిబంధనల మేరకు అధికారులే ఈ వేలం పాట నిర్వహిస్తున్నందున గొడవ చేయడం తగదని అయ్యన్నపాలెం ఉప సర్పంచ్ రామకృష్ణ పేర్కొన్నారు.



పోలీసుల సమక్షంలోనే ఘర్షణ పడుతున్న ఇరువర్గాల వారు

నియోజకవర్గంలో రూ.229 కోట్లతో అభివృద్ధి పనులు

- కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే...
- సీసీ రోడ్లు, డ్రైన్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు


బంగారమ్మపాలెంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. మండలంలోని రాయపు అగ్రహారం, ఎ.సిరసపల్లి, బంగారమ్మపాలెం, చిన బంగారమ్మపాలెం, పెదయాతపాలెం గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను బుధవారం ప్రారంభించారు. అనంతరం పెదయాతపాలెంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కూటమి అధికారం చేట్టాక పెందుర్తి నియోజకవర్గంలో రూ.229 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరో రూ.164 కోట్లు మంజూరయ్యాయన్నారు. దువ్వాడ- అసకపల్లి రోడ్డుకు రూ.30 కోట్లు, గొల్లలపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డుకు రూ.24 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. పెదయాతపాలెంలో ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేస్తామన్నారు. జనసేన నాయకుడు ఆళ్ల శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఝాన్సీరాణి, సర్పంచ్‌లు దాడి లావణ్య, పాలిశెట్టి పార్వతి, ఏవో శివరాంప్రసాద్, నాయకులు ఇందలి రమణ, దొడ్డి సూర్యప్రకాశరావు, శరగడం రాము, దాడి కన్నంనాయుడు, రాపేటి రాము, ఆడారి నాగరాజు, వెంకట్, చినరాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల రవాణా నివారణకు పక్కాగా చర్యలు

- రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ సీఐ శ్రీనివాసరెడ్డి


ప్లాట్‌ఫారంపై అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు

అనకాపల్లి టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పిల్లల అక్రమ రవాణా నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సీఐ బి.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అనకాపల్లి ఆర్‌పీఎఫ్ అధికారులు చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల అక్రమ రవాణాను నిరోధించేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రస్తుతం చట్టాలపై అవగాహన పెంచినట్టు చెప్పారు. అక్రమ రవాణా నెట్‌వర్క్ గురించి కమ్యూనిటీలను అప్రమత్తం చేయడం, రక్షించిన పిల్లలకు సకాలంలో న్యాయం, సమర్థవంతమైన పునరావసం వంటివాటి కోసం అన్ని ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం అత్యవసరమన్నారు. అంతకుముందు ప్లాట్‌ఫారంపై అవగాహన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నవీన్, సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ సచి నివాస్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నరేంద్ర, రమేష్, సన్యాసిరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తాచెదారం కనిపించరాదు : జెడ్సీ


నరసింగరావుపేటలో చెత్త తొలగింపును పరిశీలిస్తున్న జెడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్, నరసింగరావుపేటల్లో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి బుధవారం విస్తృతంగా పర్యటించారు. పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చెత్తను ఎత్తేటప్పుడు ఎక్కడా రోడ్లపై ఉండకుండా పూర్తిస్థాయిలో తొలగించాలని క్లాప్ డ్రైవర్లు, లోడర్స్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి స్థానికులు వీధిలైట్ల సమస్యను తీసుకు వెళ్లారు వీధిలైట్లు లేకపోవడం వల్ల రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నట్టు వివరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ అధికారులతో మాట్లాడి వీధిలైట్లు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం

సబ్బవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీఐటీయూ నాయకులు సబ్బవరంలో బుధవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లాఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వలన అదానీకే లాభం తప్ప, వినియోగదారులకు ఉండదన్నారు. ప్రజలంతా ఈ విషయమంలో చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ సత్యవతి, శ్యామలా, గౌరీసు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు నెలాఖరుకు 50 శాతం ఆస్తి పన్ను వసూలు లక్ష్యం

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కమిషనర్

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 31నాటికి 50 శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా రెవెన్యూ అధికారులు పనిచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు, అన్ని జోన్ల రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో పాటు వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులతో సమీక్షించారు. గత సమీక్షలో నిర్దేశించిన ఆస్తి పన్నుల వసూళ్లపై ఆరా తీశారు. నగరాభివృద్ధి దిశగా జీవీఎంసీ పలు కార్యక్రమాలను చేపడుతున్న నేపథ్యంలో ఆర్థిక పరిపుష్టిని మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత వారంతో పోల్చితే కొన్ని జోన్లలో రెవెన్యూ శాతం పెరిగినప్పటికీ, మరికొన్ని జోన్లలో మందకొడిగా ఉంద న్నారు. ప్రతి రెవెన్యూ అధికారి వారి వసూళ్లను పెంచాలన్నారు. వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త, పాత బిల్డింగ్ కొలతలు సరి చూడాలని సూచించారు. తాగునీటి కనెక్షన్ ఉంటే నీటి పన్ను చెల్లిస్తున్నదీ లేనిదీ పరిశీలించాలని, ఈ ప్రక్రియ 5 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు కేసుల స్టేటస్-కో స్టడీ చేసి కౌంటర్ ఫైల్ దాఖలు చేయాల న్నారు. ఆస్తి పన్ను వసూలు కేంద్రాలను పెంచేందుకు ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉన్న ఒక సచివాలయాన్ని ఎంపిక చేసుకుని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. వార్డు సచివాలయాల్లో కంప్యూటర్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ఐటీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ యూఎన్ నరసింగరావులకు సూచించారు.

బ్యాంకుల్లో సెక్యూరిటీని పటిష్ఠం చేయాలి

- బీఎంల సమావేశంలో అడిషనల్ ఎస్పీ మోహనరావు



బ్యాంక్ మేనేజర్లతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ మోహనరావు

అనకాపల్లి టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకుల్లో సెక్యూరిటీని పటిష్టం చేసుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైమ్) మోహనరావు సూచించారు. ఇక్కడి పోలీస్ అతిథి గృహ సమావేశ మందిరంలో పట్టణంలోని బ్యాంక్ మేనేజర్లతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులకు వచ్చే వారిపట్ల సెక్యూరిటీ సిబ్బంది నిఘా పెట్టాలన్నారు. కొత్తవారు ఎవరైనా వస్తే వారి కదలికపై ప్రత్యేక దృష్టిసారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకులతో పాటు ఏటీఎం కేంద్రాల్లో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని పట్టణ పోలీస్ స్టేషన్‌కు అనుసంధానమయ్యేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా అలారం విధానం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ ఎం.శ్రావణి, పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్‌ఐలు, సిబ్బంది, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

అనకాపల్లి డివిజన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లి టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : డివిజన్‌లో విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంత రాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ విలేకరులకు తెలిపారు.

గాంధీ మార్కెట్ సబ్ స్టేషన్ పరిధిలో...

పట్టణంలోని గాంధీ మార్కెట్ 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గల రింగురోడ్డు, నెయ్యిల వీధి, మళ్ల వీధి, పెరుగుబజార్, కోట్నీవీధి, చిన్నవీధి, కరణాల వీధి, గాంధీబొమ్మ జంక్షన్‌లలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే, గవరపాలెం సెక్షన్ పరిధిలోని న్యూకాలనీ, బాలికోన్నత పాఠశాల, రావు గోపాలరావు కళాక్షేత్రం, ఆర్టీసీ కాంప్లెక్స్, పూడిమడక రోడ్డు ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు. అదేవిధంగా వన్‌వే జౌన్, కస్పావీధి, బండిగాడి వీధి, ఎన్టీఆర్ ఆసుపత్రి, కూరగాయల మార్కెట్, చిన నాలుగురోడ్ల జంక్షన్, మెయిన్‌రోడ్డు, పూల్‌బాగ్ రోడ్డు, రఘురాం కాలనీ, చింతావారి వీధి, వేగివీధి ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పార్కు జంక్షన్, నతకంపట్టు, సంతోషిమాత ఆలయం, బాలకృష్ణ బస్టాప్, రింగురోడ్డు, రైతు భారతి కల్యాణ మండపం, దాడి భోగలింగంనాయుడు వీధిలో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని వివరించారు.

కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో...

కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలోని టీపీ రోడ్డు, తిమ్మాపురంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, కొక్కిరాపల్లి, పెదపల్లి, ఏజీఎల్ మర్రిబంద ప్రాంతాల్లో, పెదపల్లి సెక్షన్ పరిధిలోని పెదపల్లి, గొల్లలపాలెం, మంత్రిపాలెం, వెంకటాపురం, చినషేకిళ్లపాలెం, పెద షేకిళ్లపాలెంలలో కూడా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా కొరుప్రోలు సెక్షన్ పరిధిలో పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

సత్యవరం, కొండకర్ల సబ్‌స్టేషన్ల పరిధిలో...

పాయకరావుపేట రూరల్ సత్యవరం సబ్ స్టేషన్ పరిధిలోని సత్యవరం, మంగవరం, మాసాహెబ్ పేట, కొండకర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని కొండకర్ల గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ వివరించారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

పెరుగుబజార్ రోడ్డు అభివృద్ధికి ఆందోళన



నిరసన తెలుపుతున్న సిద్ధార్థ సోషల్ సర్వీసెస్, కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నిలిచిపోయిన స్టేషన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడి పెరుగుబజార్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం ఇరుకుగా ఉన్న రోడ్డు వలన పెరుగు బజార్ జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్ వరకు వెళ్లే మార్గంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇది గుర్తించిన అధికారులు యాభై అడుగుల రోడ్డుగా విస్తరించాలని నిర్ణయించి పనులను ప్రారంభించారన్నారు. అయితే ఈ పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడం వల్ల పలు చోట్ల రహదారి గోతులమయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి రహదారి అభివృద్ధి పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాల్సిందిగా కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- సహిత విద్య జిల్లా సమన్వయకర్త కృష్ణంనాయుడు


విద్యార్థులు, తల్లిదండ్రులతో సహిత విద్య జిల్లా సమన్వయకర్త కృష్ణంనాయుడు

పరవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తున్నట్టు సహిత విద్య జిల్లా సమన్వయకర్త బీఆర్ వీఆర్ కృష్ణంనాయుడు తెలిపారు. మండల కేంద్రం పరవాడ మండల పరిషత్ జంక్షన్ వద్ద గల భవిత కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు సమగ్రశిక్ష పథకం ద్వారా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. డిజిటల్ లెర్నింగ్, ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ తదితర అంశాలపై వివరించారు. అలాగే కేంద్రంలో అమలు చేస్తున్న ఫిజియోథెరపీ సేవలను తెలియజేశారు. అంతకుముందు ఆయన భవిత కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ది ల్యామోస్ స్టోర్ కంపెనీ న్యూ ఫౌండర్స్ ఆర్థిక సహాయంతో దివ్యాంగ విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సాయిశైలజా, భవిత కేంద్రం ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, ల్యా మోస్ స్టోర్ న్యూ ఫౌండర్స్ కృష్ణవంశీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరచి ప్రయాణిస్తే.. ఆసుపత్రిపాలే..

- పరవాడ- కలపాక మధ్యలో ప్రమాదకరంగా మలుపులు
- ఆందోళన చెందుతున్న వాహనదారులు


వెన్నెలపాలెం సమీపంలో గల ప్రమాదకర మలుపు


కలపాక బీసీ కాలనీ సమీపంలో...

పరవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ సినిమాహాల్ జంక్షన్ నుంచి వెన్నెలపాలెం, స్వయంభూవరం మీదుగా కలపాక గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో పలుచోట్ల మలుపులు ప్రమాదకరంగా మారాయి. వేగంగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ఈ మలుపుల వద్ద అదుపు తప్పుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికితోడు రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ముఖ్యంగా వెన్నెలపాలెం సమీపంలో గల మలుపులతో పాటు కలపాక బీసీ కాలనీ సమీపంలోని మలుపు వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ఈ మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో సర్పంచ్ లక్ష్మి

పరవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లి పంచాయతీ పోలిరెడ్డిపాలెం తారకరామా కాలనీలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ శివలంక లక్ష్మి ప్రారంభించారు. ఇందుకోసం సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.ఐదు లక్షలు కేటాయించినట్టు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పోలవరపు మంగ, వియ్యపు ముత్యాలు, కె.అప్పారావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పశుదాణా


రాయితీపై దాణాను అందిస్తున్న అధికారులు

కశింకోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగబిల్లి పశువైద్య కేంద్రం వద్ద పది గ్రామాల పాడి రైతులకు రాయితీపై బుధవారం పశు దాణాను పంపిణీ చేశారు. తాలుత పశు వైద్యాధికారిణి డాక్టర్ అల్ఫన్స్ జార్జి మాట్లాడుతూ యాభై కిలోల దాణాను యాభై శాతం రాయితీపై రూ.555లకు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు షేక్ దర్గా, మజ్జి ప్రకాశ్, అప్పలకొండ, నూకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

తుమ్మపాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అల్లికానుడుపాలెంలో గల ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. బుధవారం అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాల భవన నిర్మాణాన్ని చేపట్టి పనులు పూర్తి చేయకుండా వదిలేశారన్నారు.

స్టాండింగ్ కమిటీ నామినేషన్ల పరిశీలన పూర్తి

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ కోసం అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన బుధవారం ముగిసింది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలకు 21 మంది నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దాఖలైన నామినేషన్లను ఏడీసీ ఎస్.ఎస్.వర్మ, కార్యదర్శి బి.వెంకటరమణ బుధవారం పరిశీలించారు. నామినేషన్లు అన్నీ సక్రమంగా ఉండడంతో వాటిని ఆమోదిస్తున్నట్టు ప్రకటించారు. నామినేషన్ల ఉపసంహరణకు శుక్రవారం వరకూ గడువు ఉంది. వచ్చే నెల ఆరున ఎన్నిక జరగనున్నది.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

మాకవరపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నేత వెంకటపతిరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

'మల్లికార్జునస్వామి' ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు

» జోరుగా ఖరీఫ్ పనులు

కొయ్యూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు కొయ్యూరు మల్లికార్జునస్వామి చెక్‌డ్యామ్ కుడి, ఎడమ కాలువల నుంచి పుష్కలంగా నీరు చేరడంతో ఆయకట్టు కింది కొయ్యూరు, రేవళ్ళ, మంప పంచాయతీల్లోని వందలాది ఎకరాల భూములను ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. తాండవ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వర్షాలకు పుష్కలంగా వరద నీరు వస్తోంది. ఈ క్రమంలో మల్లికార్జునస్వామి చెక్‌డ్యామ్, బూదరాళ్ళ చెక్ డ్యామ్‌ల నుంచి నీరు ప్రవహిస్తోంది. దీనికి తోడు గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పథకంలో మరమ్మతులు చేసిన శనివారపుపాడు పెద్దచెరువు, చిన్న చెరువుల్లో వరద నీరు చేరింది. ఫలితంగా ఈ మూడు పంచాయతీలతోపాటు బూదరాళ్ళ చెక్‌డ్యామ్ మిగులు నీరుతో లభించే చీడిపాలెం చెక్ డ్యామ్ జలకళతో ఉండడంతో రాజేంద్రపాలెం, మర్రివాడ, చీడిపాలెం పంచాయతీల పరిధి గతంలో బీడు భూములుగా దర్శనమిచ్చే భూములన్నిటినీ ప్రస్తుతం దమ్ములు పూర్తి చేసే ప్రక్రియలో రైతాంగం పోటీ పడుతున్నారు.



ఉబాలకు సిద్ధం చేసిన నారుమడులు

గిరిజన గ్రామాల్లో ముమ్మరంగా వరి నాట్లు

చింతపల్లి: ఏజెన్సీలో ఆదివాసీ రైతులు ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. పది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వరి నారు పోసిన రైతులకు తాజా వర్షాలు నాట్లుకి అనుకూలించాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా వరి నాట్లుతో రైతు బిజీగా కనిపిస్తున్నారు. బుధవారం చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోనూ దేశవాళి రకాల విత్తనోత్పత్తి కోసం వరి నాట్లు వేశారు.

పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

గూడెంకొత్తవీధి, జూలై 30 , (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు బుధవారం పాడేరు మార్కెట్ యార్డు చైర్మన్ మచ్చల మంగాతల్లి ప్రమాణ స్వీకారమహోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ బాధ్యతలను చేపట్టిన ఆమెకు అభినందనలు తెలిపి సన్మానించారు. టీడీపీ పాడేరు టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, జనసేన పార్టీ ఇన్‌చార్జి వి.గంగులయ్యఎంపీటీసీ (బీజేపీ) , బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు రీ ముల రాజేశ్వరి, నాయకులు కాకూరి శేఖర్, ఎం. రామ్ కిరణ్‌కుమార్, రీములపాల్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. .



పాడేరు ఏఎంసీ చైర్మన్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

'పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలి'

ముంచంగిపుట్టు, జులై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని సీపీఎం మండల కార్యదర్శి కె. త్రినాథ్ అన్నారు. బుధవారం ఆ యన మాట్లాడుతూ వివిధ విభాగాలకు సంబంధించి సుమారు ఎనిమిది మంది ప్రత్యేక వైద్య నిపుణులు సీహెచ్‌సీలో ఉండాలని, కానీ, కేవలం ముగ్గురికి మాత్రమే పరిమితమయ్యారన్నారు. ఆ ముగ్గురిలో ఒకరు డెంటల్ డాక్టర్, మిగిలిన ఇద్దరూ సీహెచ్‌సీకి వచ్చే రో గులకు ఆరోగ్య పరీక్షలు, ఇతర వైద్య సేవలందించాల్సి వస్తోందన్నారు. దీని వల్ల రోగులకు సకాలంలో వైద్య సేవలందే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వ్యాధులు సీజన్ కావడంతో ఆస్పత్రికి రోజూ 200 నుంచి 300 వరకు రోగులు వ స్తున్నారని, ఈ స్థితిలో అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి: డీఎల్‌పీవో

అరకులోయ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో విధిగా ప్రతీ రోజూ చెత్తను సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీఓ కుమార్ ఆదేశించారు. పద్మాపురం పంచాయతీ పరిధిలో యండపల్లివలసలో బుధవారం ఆయన పర్యటించారు. ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తను సర్పంచ్ సుస్మితతతో కలిసి పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. యండపల్లివలస శివారునున్న ఖాళీ స్థలంలో చెత్తను తరలించారు. ప్రధాన రహదారి పక్క చెత్త వేయవద్దని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామ చివరన ఉన్న కెనరాబ్యాంకు కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే పద్మాపురం, అరకు రైల్వేస్టేషన్, యండపల్లివలస, రాజధాని జంక్షన్‌లలో పరిసరాలను పరిశు భ్రంగా ఉంచేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, కార్యదర్శి పాత్రుడు పాల్గొన్నారు.



యండపల్లివలసలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కుమార్, సర్పంచ్ సుస్మిత

జాబ్‌మేళాలో 64 మంది ఎంపిక



అభ్యర్థులకు నియామకపత్రాలను అందిస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రేణుక, ప్రతినిధులు

అరకులోయ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఆర్‌ఐటీఐ లో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 64 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాధికారి డాక్టర్ పి.రేణుక తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 140 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 64 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేసినట్టు జిల్లా నైపుణ్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్ ఉమాశంకర్, జేఈవో ఎస్‌కే మనోరామ , ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో గూగుల్ మ్యాప్ స్థిరీకరణకు చర్యలు

కొయ్యూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మన్యంలోమారుమూల కొండలపై గల గ్రా మాలను సైతం గూగుల్‌మ్యాప్‌కు అనుసంధానం చేస్తూ మహేంద్రటెక్ కంపెనీ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆ ప్రతినిధులు ప్రత్యేక వాహనంలో పలు కొండలపై పం చాయతీలను సందర్శించి గూగుల్‌మ్యాప్ అను సంధానం ప్రక్రియ చేపట్టారు. మన్యంలో ప్రతి పంచాయతీ, కొండలపై గల గ్రామాలతోపాటు పర్యాటక ప్రదేశాలు తదితర వివరాలను గూగుల్ మ్యాప్‌లో క్రోడీకరిస్తున్నట్టు ఆ కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఇప్పటి వరకు శాటిలైట్ సిస్టంతోనే గుర్తించే ఈ ప్రదేశాలు ఇకపై గూగుల్‌మ్యాప్ ఆధారంగా అనుకున్న చోటుకు సులభంగా చేరేలా ఈ ప్రక్రియ వీలవుతుందనివారు పేర్కొన్నారు.



కొయ్యూరు, కాకరపాడుల మధ్య గూగుల్ మ్యాప్ సిద్ధం చేస్తున్న మహీంద్ర టెక్ కంపెనీ ప్రతినిదులు

పాడేరు మండల సమావేశం రేపు

పాడేరురూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సొనారి రత్నకుమారి అధ్యక్షతన ఆగస్టు 1వ తేదీన నిర్వహించనున్నామని ఎంపీడీవో జె.తేజరతన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్‌లో ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్‌లు, మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

రాత్రి బస్సు సర్వీసులు రద్దు

ముంచంగిపుట్టు, జులై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మీదుగా జోలాపుట్టు, దోడిపుట్టు వెళ్లే రాత్రి బస్సు సర్వీసులను అధికారులు రద్దు చేశారు. సీపీఐ మావోయిస్టు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు నేపథ్యంలో రాత్రి బస్సు సర్వీసులను రద్దు చేసి, వాటిని మండల కేంద్రం వరకు పరిమితం చేశారు. వారోత్సవాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రం మీదుగా వివిధ ప్రాం తాలకు వెళ్లే వాహనాలను, వచ్చే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేపడుతున్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి: సీపీఎం

కొయ్యూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అదాని స్మార్ట్ విద్యుత్ మీటర్లు ఏర్పాటును గృహ విద్యుత్ వినియోగదారులు అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక గిరిజన భవన్‌లో రాష్ట్ర కమిటీ ముద్రించిన క్యూ ఆర్ కోడ్‌ను గ్రామస్తులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రూ ఆప్ చార్జీలు రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లతో వినియోగదారులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. వినియోగదారునికి విద్యుత్ సరఫరాకు గ్యారెంటీ ఉండదన్నారు. అలాగే స్మార్ట్ మీటరు ఖరీదు, దానికి అనుబంధంగా వాడే పరికరాల ఖర్చును వినియోగదారుడే భరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీని వలన అల్పాదాయ వర్గాలు విద్యుత్ వినియోగానికి దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు అప్పలనాయుడు, బొంజన్న సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తం



రిటైర్డ్ అధ్యాపకుడు రామ్మోహన్‌రావుని సన్మానిస్తున్న ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి, శాస్త్రవేత్తలు

చింతపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పదవీ విరమణ పొందిన అధ్యాపకుడు కె. రామ్మోహన్‌రావు తెలిపారు. బుధవారం స్థానిక ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, టీచింగ్ అసోసియేట్, ఉద్యోగులకు ఈ మేరకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పు రావాలన్నారు. పొగ తాగడం, ప్లాస్టిక్, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఒక్కసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్‌కి పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్‌లో వేడి ఆహారం, పానీయాలు తీసుకోరాదన్నారు. ఫుడ్ కలర్, రసాయనాలతో కూడిన ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఏడీఆర్ డాక్టర్ అళ్ల అప్పలస్వామి, శాస్త్రవేత్తలు, కళాశాల విద్యార్థులు రామ్మోహన్‌రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపురెడ్డి, బాలహంస్‌సేన్‌రెడ్డి, సందీప్ నాయక్, జోగారావు, టీచింగ్ అసోసియేట్‌లు పాల్గొన్నారు.

జ్వర పీడితులకు పరామర్శ

గూడెంకొత్తవీధి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో వైద్యులు ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని స్థానిక టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు అన్నారు. మండలంలో జ్వరాలు ప్రబలిన టంగళ్లగొంది గ్రామాన్ని సందర్శించిన టీడీపీ నాయకులు రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈసందర్భంగా కొండలరావు మాట్లాడుతూ టంగళ్లగొందిలో ఆర్‌వీనగర్ వైద్యాధికారి రవీంద్రనాథ్ చౌదరి, సిబ్బంది వచ్చి వైద్య పరీక్షలు చేశారన్నారు. అయితే గ్రా మంలో వ్యాధులు అదుపులోకి వచ్చే వరకు బేస్ క్యాంప్‌ని కొనసాగించాలన్నారు. ఆదివాసీలు వైరల్ జ్వరాలు, మలేరియా, అతిసార, దగ్గు, జలుబు వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. ఈ స్థితిలో ఇతర గ్రామాల్లోనూ ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు గంటా నళిని, టీడీపీ నాయకుడు ముక్కలి మహేశ్ పాల్గొన్నారు.



టంగళ్లగొందిలో రోగులకు రొట్టెలందజేస్తున్న టీడీపీ నేతలు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

» విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. బుధవారం చొంపి గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్య క్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఈఏడాదిలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులపై కరపత్రాలు అందించారు. వృద్ధులను పరికరిస్తూ పింఛన్లపై ఆరా తీశారు. గతంలో రూ. 3 వేల పింఛన్‌ను రూ. 4 వేలు చేసినట్టు ఆయన వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉచితంగా మూడు సిలిండర్లు, కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికివందనం పథకం ప్రభుత్వం మంజూరు చేసినట్టు చెప్పారు. అన్న క్యాంటీన్లు పునరుద్ధరించినట్టు వివరించారు. ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ పథకం అమలు, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్‌ప్రయాణం అమలు చేయనున్నట్టు తెలిపారు. గ్రామాలలో సీసీరోడ్లు, జలజీవన్ పథకం కింద తాగునీటికుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. విద్యామంత్రి నారా లోకేశ్ విప్లవాత్మక మార్పు లు తీసుకురావడంతో ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో 11 శాతం అడ్మిషన్లు పెరిగాయన్నారు.అయితే ప్రతిపక్షాలు మాత్రం తప్పుడు ప్రచారం సాగిస్తున్నట్టు ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు జి.గుండు, నాయకులు పొట్టంగి అప్పారావు, సాగర్, జానీ రాము, పెట్టెలి బీమన్న, కొర్ర పరశురాం, కో-ఆర్డినేటర్ పెట్టెలి బాలు, వంతల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



చొంపి గ్రామంలో ప్రచారం చేస్తున్న దొన్నుదొర, నాయకులు

'సుపరిపాలనలో ఏడాది'

కొయ్యూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం లోనే పేదల సంక్షేమం సాధ్యపడుతుందని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలో చీడిపాలెం పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధి గ్రామాలలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను అందచేశారు. ముఖ్యమంత్రి ముందు చూపుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్. శ్రీను, యూనిట్ ఇన్‌చార్జి సింహాచలం, డౌనూరు గ్రామ కమిటీ అధ్యక్షులు దేవి, పాంగి భీమ రాజు తదితరులు పాల్గొన్నారు.



చీడిపాలెంలో కరపత్రాలందిస్తున్న టీడీపీ నేతలు

గుత్తులపుట్టును మండలంగా ప్రకటించాలని ర్యాలీ



కుంతుర్లలో ర్యాలీ చేస్తున్న గుత్తులపుట్టు మండల సాధన కమిటీ నాయకులు

పెదబయలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో 14 పంచాయతీలకు అనుకూలంగా ఉన్న గుత్తులపుట్టును ప్రత్యేక మండలంగా ప్రకటించాలని కోరుతూ గుత్తులపుట్టు మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కుంతుర్లతోపాటు పలు గ్రామాల గిరిజనులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న 14 పంచాయతీలను పెదబయలు మండలంలో కలపటంతో శివారు గ్రామాల గిరిజనులు పౌర సేవలకు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఈసందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంచాయితీలు మండల కేంద్రానికి దూరంగా ఉండటం ఏ అధికారి సందర్శించడంలేదన్నారు. ఫలితంగా అభివృద్ధికి దూరమవుతున్నాయని పేర్కొన్నారు. 14 పంచాయతీలను కలుపుకుని గుత్తులపుట్టును మండలంగా ప్రకటించాలని పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వాలు స్పందించలేదని వాపోయారు. తమ గ్రామాలకు రవాణా, ఇతర సౌకర్యాలు కలగాలంటే గుత్తుపుట్టును మండలంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, బోనంగి పడాల్, బాబూజీ, సింహాచలం, గోవింద్‌పడాల్, బంగారునాయుడు. లక్ష్మణ్ పడాల్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ కార్మికుల సమస్యలు పట్టించుకోరా?



మాట్లాడుతున్న జీసీసీ, ఐటీడీఏ పెట్రోల్ బంకుల కార్మికులు

పాడేరురూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జీసీసీ, ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుపుతున్న పెట్రోల్ బంక్‌లలోని కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని పెట్రోల్ బంక్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సోమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను అమలు చేయడంలేదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బంకుల్లో నిర్ణీత పని గంటలను అమలు చేయడంలేదని, కార్మికులకు ఈఎస్ఐ, వైద్యం, పీఎఫ్ రికవరీ వర్తించడంలేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి జిల్లాలోని జీసీసీ, ఐటీడీఏ పెట్రోల్ బంకుల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. కార్మికుల వేతనాలు బ్యాంక్ అకౌంట్‌లోనే జమచేయాలని, వేతనాలతో కూడిన సెలవు దినాలు అమలు చేయాలని, కార్మికులను జీసీసీ, ఐటీడీఏ ఉద్యోగులుగా గు ర్తించాలని కోరారు. ఈసమావేశంలో యూనియన్ నేతలు మత్స్యరాజు, శ్రీకాంత్, మోహన్, శ్రీకాంత్, మోహన్ పాల్గొన్నారు.

పశు పోషణకు బ్యాంకు రుణాలు

» ప్రాంతీయ పశువుల ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ పి.వేణుమాధవ్



గ్రామ రైతులకు జొన్నగడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏహెచ్‌వో వేణుమాధవ్

పాడేరురూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పశువుల పెంపకం రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా బ్యాంకు రుణాలందజేయనున్నట్టు ప్రాంతీయ పశువుల ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ పి.వేణుమాధవ్ తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని డి.గొందూరు పంచాయతీ కొక్కెళ్ళు గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. హైబ్రీడ్ పశుగ్రాసాల రకాలు నేపియర్, కో-1, ఏపీబీఎన్, జోవార్, అజ్జోల్లా (నాచుగడ్డి) తదితర వాటిని వివరించారు. వీటితో పశువులకు పోషక విలువలు అందుతాయని, పాల దిగుబడి పెరగడంతో ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయన్నారు. పశు పోషణకు బ్యాంకుల ద్వారా రుణాలకు రైతులు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డు కాపీలు సమర్పించాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల నిరోధానికి మూగజీవాలకు ఉచిత టీకాలు, నట్టల నివారణ మందులను వేయించాలన్నారు. అనంతరం రైతులకు జొన్న గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డోకులూరు పశు వైద్య సహాయక అధికారి కె.సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన వద్ద అసంపూర్తి అప్రోచ్ రోడ్డుతో తిప్పలు



మాలింగవలస-పాతకోట రోడ్డులో పూర్తయిన వంతెన వద్ద అప్రోచ్ వద్ద పేరుకున్న మట్టి

అనంతగిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి పంచాయతీ మాలింగవలస-పాతకోట మార్గంలో సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన వంతెనకు అప్రోచ్‌వాల్ పనులు పూర్తికాకపోవడం గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మాలింగవలస గెడ్డ ఉధృతంగా ప్రవహించే సమయంలో రాకపోకలకు గిరిజనులు అవస్థలు ఎదుర్కొనేవారు. అయితే, వంతెన మంజూరు కావడం గిరిజనులకు సమస్య తప్పింది. వంతెన నిర్మాణం దాదాపుగా పూర్తిచేసినా, అప్రోచ్ పనులు నిలిచిపోవడంపై పాతకోట, మాలింగవలస, తేనెపుట్టు, తలారీపాడు, నందిగుమ్మి, రేగం, తదితర గ్రామాల గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

సీలేరు, జూలై 30, (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు విద్యార్థులు దూ రంగా ఉండాలని సీలేరు ఎస్ఐ రవీంద్ర సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్‌లో బుధవారం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోక్సో చట్టాలు, యాంటీ ర్యాగింగ్, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన క ల్పించారు. శక్తి యాప్, డయల్ 100, సైబర్ క్రైం తదితర అంశాలను వివరించారు ఎవరైనా ర్యాగింగ్ పేరుతో ఇబ్బందికి గురిచేసినా , కాలేజీ ప్రాంగణంలో మద్యం, గంజాయి సేవించినా వెంటనే తమ దృష్టికి తీసుకుకావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి . శంకరరావు, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీ సాధనకు రేపటి నుంచి జీపుజాత

పెదబయలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతోనే భర్తీ చేయాలని ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్నపడాల్, గిరిజన సంఘం మండల అధ్యక్షులు బొండా సన్నిబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గిరిజన ఉద్యోగుల భవనంలో ప్రతేక డీఎస్సీ సాధన కమిటీ మండల కార్యవర్గాన్ని 13 మందితో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆగస్టు 1వ తేదీ నుంచి చింతపల్లి మండలంలో జీపు జాత ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామాలలో గిరిజన నిరుద్యోగులను చైతన్య పరుస్తూ ఆగస్టు 8వ తేదీన ఐటీడీఏ ముందు మహా ధర్నాతో ఈ జాతా ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జాగరాపు చలపతి, కో కన్వీనర్లు మత్స్యకొండ పడాల్, వినయ్, దిలీప్, కృష్ణవేణి, సభ్యులు సత్యారావు, స్వామి, బాల రాజు, కొండబాబు, కమలాకర్, శివకుమార్, కృష్ణ, రాజేశ్వరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వృథాగా ప్రభుత్వ భవనాలు

డుంబ్రిగుడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో లక్షలాది రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు అక్కరకు రాకుండా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో కొర్రా పంచాయతీ కేంద్రంలో డీఆర్‌డిపో భవనాన్ని 10 ఏళ్ల క్రితం లక్షలాది రూపాయలతో నిర్మించారు. అనంతరం నిర్వహణకు ఉపయోగించకకుండా వదిలేయడంతో అది నిరుపయోగంగా మారింది. ఆకతాయిలకు అడ్డాగా నిలుస్తోంది. నిర్వహణ లోపంతో దానిని అనుకుని షెల్టర్ తుప్పు పట్టింది. అప్పటినుంచి ఇప్పటి వరకు ఈ భవనం వృథాగా దర్శనమిస్తోంది. సంబంధిత అధికారులు కొద్దిపాటి నిధులు కేటాయించి షెల్టర్ మరమత్తులు చేపడితే, ఉపయోగంలోకి వస్తుందని గ్రామస్థులు అభి ప్రాయం వ్యక్తంచేస్తున్నారు.



నిరుపయోగంగా కొర్రాపంచాయతీ కేంద్రంలో డీఆర్‌డిపో

ప్లాస్టిక్ వ్యర్థాలతో మూగ జీవాలు మృత్యువాత

పెదబయలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పశువులను యజమానులు గ్రామాల్లో విచ్చలవిడిగా విడిచిపెట్టడంతో పలు వ్యర్థాలు తిని అవి మృత్యువాత పడుతున్నాయి. గతంలో పశువులను వ్యవసాయానికి ఉపయోగించేవారు. ప్రస్తుతం ఆధునిక యంత్రాల రాకతో పశు సంపదను నిర్లక్ష్యం చేస్తున్నారు. వాటి సంరక్షణ బాధ్యతలను రైతులు వ దిలేశారు. దీంతో మండల కేంద్రంలో దుకాణాల వద్ద పేపర్లు, ప్లాస్టిక్ కవర్ల, చెత్త కుండీల వద్ద మురిగిపోయిన ఆహార పదార్థాలను మూగజీవాలు తినటంతో రోగాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. ఇలా, ఇటీవల తరచూ పశువులు మృతి చెందుతున్నాయి. తాజాగా మండల పరిషత్ క్వార్టర్స్ సముదాయంలోని పొదల్లో బుధవారం ఓ పశువు మృతిచెందింది. స్థానికులు సమాచారం మేరకు సర్పంచ్ మాధవరావు, ఎం పీటీసీ సభ్యుడు కిమం కరి బొంజుబాబు చొరవ తీసుకుని క్లాప్ మిత్రల ద్వారా ఆ ఆవును మత్స్యగెడ్డ ప్రాంతానికి తరలించి పాతిపెట్టారు. ఇకనైనా, పశువులను సంబంధిత యజమానులు తమ వద్దనే ఆశ్రయం కల్పించి సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



పెదబయలులో మృతి చెందిన ఆవును తరలిస్తున్న క్లాప్‌మిత్రలు



ఎం.కోటపాడులో డ్రోన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

పంటలపై మందుల పిచికారీకి డ్రోన్

మాడుగుల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పంటలపై మందుల పిచికారీకి డ్రోన్ ప్రారంభించినట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఎం.కోటపాడు గ్రామంలో బుధవారం డ్రోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను అన్ని విధాలా వ్యవసాయం చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తున్నదన్నారు. రైతులకు ఈ డ్రోన్ పిచికారీపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.అనసూయ మాట్లాడుతూ రైతులకు ఎంతగానో ఉపయోగపడే ఈ డ్రోన్ రూ.9.8 లక్షలు కాగా, 80 శాతం రాయితీపై కేవలం రూ.1.96 లక్షలకే ప్రభుత్వం అందిస్తున్నది చెప్పారు. ఎకరా పంటకు ఆరు నిమిషాల్లోనే ఈ డ్రోన్ ద్వారా పిచికారీ చేయవచ్చుని, ఇందుకోసం కేవలం రూ.400 మాత్రమే ఖర్చవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పరాజు, నాయకులు సన్యాసిరావు, రమేశ్, లెక్కల కాశిబాబు, సూర్యనారాయణరాజు, కొట్నాల త్రినాథ్, బుద్దాల రమణ, లక్ష్మీరావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఇంటర్నెట్ సేవలు విస్తృతం చేయండి

» జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావునాయుడు



మండల విద్యా శాఖ భవనంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

మాకవరపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ సేవలను విస్తృతం చేసేందుకు తగిన చర్యలు చేపట్టామని జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావునాయుడు ఆదేశించారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో బుధవారం ఇంటర్నెట్‌కు సంబంధించిన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ ఆదేశాలతో ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తునటుట్టు చెప్పారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో రూటర్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే పాఠశాల్లో ఉండే 4జీ సిమ్‌ల స్థానంలో 5జీ సిమ్‌లు ఇచ్చి, వాటిని అప్‌గ్రేడ్ చేయాలని డీఈవో సూచించారు. అనంతరం విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారులు, ఎంఈవో మూర్తి పాల్గొన్నారు.

చోడవరంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'



బాలాజీనగర్‌లో కరపత్రాలు అందిస్తున్న మల్లునాయుడు తదితరులు

చోడవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలాజీనగర్, కోఆపరేటివ్ కాలనీ, చైత్రనగర్ తదితర ప్రాంతాల్లో టీడీపీ సీనియర్ నేత గూనూరు మల్లునాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను అందించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం హామీలు దాదాపు నెరవేర్చిందని ఈ సందర్భంగా మల్లునాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రంశెట్టి చిన్న, శ్రీను, పార్థురాజు, విస్సు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలని ధర్నా



బ్రిటీష్ సమాధుల స్థలం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

నర్సీపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చారిత్రక బ్రిటీష్ సమాధుల స్థలంలో అక్రమ నిర్మాణాలు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్న సమాధుల స్థలం ఎదుట బుధవారం ప్రజా సంఘాలతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దీనిపై ప్రజా సంఘాల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందు తున్నా స్పందించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని కౌన్సిలర్లు గురువారం జరగబోయే మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తాలని ఆయన డిమాండ్ చేశారు. ఆక్రమణలు తొలగించక పోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధి త్రిమూర్తులు రెడ్డి, ఐద్వా ప్రతినిధులు కేవీ.సూర్యప్రభ, ఎల్.గౌరీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బందికి సత్కారం



వ్యవసాయ, ఉద్యానవన శాఖల సహాయకులను సత్కరిస్తున్న దృశ్యం

దేవరాపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయకులకు బుధవారం సత్కరించారు. మండలం నుంచి బదిలీపై వెళ్తున్న వారికి మండల వ్యవసాయ శాఖాధికారి ఎల్‌వై.కాంతమ్మ శాలువాలతో కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రైతులకు వారు అందించిన సేవలను కొనియారు. పారదర్శకంగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. విస్తరణ అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి

» మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

» ఎం.కోటపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా పిల్లా నాయుడు ప్రమాణ స్వీకారం



పర్సన్ ఇన్‌చార్జి, డైరెక్టర్లకు సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. ఎం.కోటపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పిల్లా నాయుడు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పదవి ఎంతో కీలకమైనదని, రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన సేవలను అందించాలని సూచించారు. పరిపాలన బాగున్నప్పుడే ప్రజలు నాయకులకు చేరువవుతారన్నారు. రైతుకు మేలు చేస్తే భగవంతుడికి సేవ చేసినట్లేనని గుర్తుంచుకోవాలని ఆయన చెప్పారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులుగా నియోజకవర్గం నుంచి ముగ్గురిని ఎంపిక చేయగా, రాయపురెడ్డి కృష్ణ అభ్యర్థన మేరకు ఈ సంఖ్యను నలుగురికి పెంచినట్టు చెప్పారు. అనంతరం పర్సన్ ఇన్‌చార్జితో పాటు డైరెక్టర్లు గెంజి కొండలరావు, అడపా రాజుబాబు ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. వారితో పాటు ఏళ్ల కాలంగా పీఏసీఎస్‌లో పనిచేస్తున్న కార్యదర్శి బొట్టేటి లక్ష్మణరావును శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల కార్యదర్శి నందారపు సన్యాసిరావు, కార్యదర్శి పుప్పాల రమేశ్, చోడవరం జనసేన సీనియర్ నాయకుడు నానాజీ, వీర మహిళ సురేఖ, నాలుగు మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు మాడుగుల ఘాట్ రోడ్డు జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రీన్ యాపిల్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు.

గ్రామాల్లో బెల్టు షాపులు తొలగించాలి

తహశీల్దార్ కార్యాలయం ఎదుట కల్లుగీత కార్మికుల నిరసన



ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న గీత కార్మికులు

కె.కోటపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్టు షాపులు తొలగించాలని డిమాండ్ చేస్తూ కల్లు గీత కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర దేవుడు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవుడు మాట్లాడుతూ మండలంలోని దాలివలస, పిండ్రంగి, గొండుపాలెం, ఆర్‌వై అగ్రహారం తదితర గ్రామాల్లో బెల్టు షాపులను వేలం ద్వారా నిర్వహిస్తున్నారని, ఇవి కల్లుగీత కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న అన్ని బెల్టు షాపులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం రీ సర్వే హెచ్‌డీటీ కె.త్రిమూర్తులుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం సొసైటీ అధ్యక్షుడు శెట్టి రమణ, సభ్యులు కె.సహదేవుడు, అప్పలరాజు, శ్రీనివాసరావు, మహాలక్ష్మి, దేవుడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

డొంకాడ రోడ్డు నిర్మించాలని ఆందోళన



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

నర్సీపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని డొంకాడ గ్రామంలో వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం గిరిజనులు ఆందోళనకు దిగారు. గిరిజన సంఘం నాయకుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలోసబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ డొంకాడ రోడ్డు నిర్మాణానికి 2023లో రూ.60 లక్షలు నాబార్డు నుంచి మంజూరయ్యాయని, అటవీ శాఖ అనుమతులు కూడా వచ్చాయని చెప్పారు. కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో ఫారెస్టు అనుమతులు రాలేదని పనులు మొదలు పెట్టలేదని ఆరోపించారు. అలాగే వైబీపట్నం నుంచి లోసింగి వయా పెద్దగరువు రోడ్డు పనులు రూ.2.6 కోట్లతో మొదలు పెట్టి మధ్యలో వదిలేశారన్నారు. రూ.10 లక్షలతో ప్రారంభించిన అర్ల రోడ్డు పనులు కూడా అసంపూర్తిగా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారుల నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నేత చిరంజీవి, డొంకాడ గ్రామస్థులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు వాహనమిత్ర అమలు చేయాలి

» ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొరబాబు

కె.కోటపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర ద్వారా రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, 13 నెలలు గడుస్తున్నా నిధులు విడుదల చేయలేదని ఆయన ఆరోపించారు. పోలీసులు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల వేధింపులు ఆటోరంగ కార్మికులపై తీవ్రంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి.దేవుడుబాబు, రెడ్డి అప్పలనాయుడు, కాసుబాబు, ఆటో యూనియన్ ప్రతినిధులు ఎ.దేవుడు, దుర్గనాయుడు, వెంకట్రావు, ఇల్లాకు రమణ, డ్రైవర్లు పాల్గొన్నారు.

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా కృష్ణమూర్తి



టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కృష్ణమూర్తి

దేవరాపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి ఎంపీటీసీ-2 సభ్యుడు మొల్లి కృష్ణమూర్తిని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమిస్తూ పార్టీ మాడుగుల నియోజకవర్గ పరిశీలకుడు ఏసుదాసు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కృష్ణమూర్తికి బుధవారం నియామక పత్రాలు అందజేశారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

మాకవరపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నేత వెంకటపతిరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. అలాగే మండలంలో హిందీ పండిట్ పోస్టుల కొరత ఉందని, వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు నిద్ర శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కుపై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయండి: సీపీఎం

నక్కపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయవద్దని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజయ్యపేట గ్రామంలో బుధవారం మత్స్యకారులతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ప్రజలు, మత్స్యకారులు వ్యతిరేకిస్తున్న బల్క్ డ్రగ్ పార్కు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, మత్స్యకారుల జీవనోపాధికి నష్టం కలిగించే బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. అలాగే ఆగస్టు 6వ తేదీన నక్కపల్లిలో జరుపతలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

తురువోలు శివాలయానికి నిధులు

» ధూపదీప నైవేద్యానికి ప్రతి నెలా రూ.10 వేలు



తురువోలు శివాలయం ఇదే..

చీడికాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తురువోలు శివాలయానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేయించారని ఎంపీటీసీ సభ్యుడు బీళ్ల కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, బొడ్డు శ్రీరామ్మూర్తి తెలిపారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తురువోలు గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయం ధూపదీప నైవేద్యానికి నోచుకోవడం లేదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం దేవదాయ శాఖ నుంచి ఈ శివాలయానికి నెలకు రూ.10 వేలు మంజూరు చేయించారన్నారు. ఈ మొత్తంలో ధూపదీప నైవేద్యానికి రూ.7 వేలు, ఆలయంలో సేవలు చేస్తున్న పూజారికి రూ.3 వేలు చొప్పున మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు గ్రామస్థులు, భక్తుల తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆడిట్ సిబ్బందితో ఎంపీడీవో సమావేశం



సామాజిక తనిఖీ సిబ్బందితో మాట్లాడుతన్న ఎంపీడీవో

బుచ్చెయ్యపేట, జూలై 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల ఆడిట్ సిబ్బందితో ఎంపీడీవో భానోజీరావు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో 2024-25 సంవత్సరంలో చేపట్టిన పనులను తనిఖీలు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకంతో పాటు పంచాయతీరాజ్, సోషల్ ఫారెస్ట్, స్కూల్ ఎడ్యుకేషన్, హౌసింగ్ తదితర శాఖలకు సంబంధించి 1604 పనులకు గాను రూ.27.28 కోట్లకు ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే 35 పంచాయతీల్లో పింఛన్లను కూడా ఆడిట్ చేస్తారన్నారు. ఈ సమావేశంలో ఏపీవో వరహాలబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ నర్సీపట్నం ఈఈ అప్పారావు తెలిపారు. మాకవరపాలెం ఫీడర్ పరిధిలో మరమ్మతు పనుల్లో భాగంగా టీచర్స్ కాలనీ, తామరం, పెట్రోల్‌బంకు, రాచపల్లి జంక్షన్, అవంతి కళాశాల ఏరియా, కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

చోడవరంలో విద్యుత్ సరఫరా బంద్ రేపు

చోడవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జేఈ రాజు తెలిపారు. విద్యుత్ లైన్ల పనులతో పాటు 33 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు ఉన్నందున శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదని చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి, తమ సిబ్బందికి సహకరించాలని జేఈ రాజు విజ్ఞప్తి చేశారు.

18 పంచాయతీల్లో విద్యుత్ నిలుపుదల

చీడికాడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 పంచాయతీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఏఈఈ నమ్మి వెంకటరావు బుధవారం తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదని చెప్పారు. చీడికాడ, తురువోలు, అర్జునగిరి, పెదగోగాడ, చెట్టుపల్లి, చుక్కపల్లి, జి.కొత్తపల్లి, వరహాపురం, తునివలస, ఎ.అగ్రహారం, జైతవరం, బైలపూడి, సింగవరం, అప్పలరాజుపురం, ఖండివరం, వీరభద్రునిపేట, శిరిజాం, మంచాల, కోనాం పంచాయతీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గొరపూడి భూములపై హైకోర్టు స్టే

» రైతుల హర్షం

రాంబిల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎస్ఈజడ్‌కు సేకరించదలచిన రాంబిల్లి మండలం గొరపూడి రెవెన్యూలోని భూముల వ్యవహారం కోర్టులో ఉన్నందున కేసు తేలేంతవరకు అధికారులు రైతుల భూముల జోలికి వెళ్లవద్దని హైకోర్టు స్టే ఇచ్చిందని గొరపూడి పంచాయతీ అప్పన్నపాలేనికి చెందిన రైతు, టీడీపీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఈజడ్‌కు గొరపూడి రెవెన్యూలోని భూముల సేకరణకు అప్పటి ప్రభుత్వం 2006లో నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. రైతులు ఎస్ఈజడ్‌కు తమ జీవనాధారమైన పంట భూములు ఇవ్వబోమని 2008లో ఉమ్మడి హైకోర్టులో స్టే తెచ్చుకున్నారని చెప్పారు. 2017లో హైకోర్టు తీర్పు ప్రకారం 2013 యాక్టు ఆధారంగా అవార్డు చేసి కొత్త చట్టాన్ని అమలు చేయాలని, అవార్డు అయిన మూడు నెలలలోపు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోర్టు చెప్పిందన్నారు. కోర్టు ఆదేశాలను అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ ఏడాది గత మూడు నెలల నుంచి అధికారులు గొరపూడి పంచాయతీలోని గ్రామాల్లోకి వచ్చి భూములు ఇవ్వాలని, నష్టపరిహారం ఇస్తామని రైతులను బెదిరిస్తుండడంతో పాటు ప్రశ్నించే రైతులపై తప్పుడు కేసులు పెట్టి వేధించారని ఆయన ఆరోపించారు. అధికారుల వేధింపులు భరించలేని రైతులు హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో ఈ నెల 29న హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. గొరపూడి పంచాయతీ భూముల సమస్య కోర్టులో ఉన్నందున తేలేంతవరకు ఆ భూముల జోలికి వెళ్లవద్దని న్యాయమూర్తి ఆదేశించారని చెప్పారు. దీనిపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు యశ్వంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మరోసారి భూ సమీకరణ

... 5వ పేజీ తరువాయి

అవసరం చాలా ఉన్నందున ముందుగానే వాటిని సమీకరించి పెట్టుకోవాలని అనుకుంటోంది. దీనిపై కలెక్టర్లతో ముందుగానే చర్చించడంతో ఆయా జిల్లాల్లో సమీకరించడానికి అనువైన భూములను గుర్తించి సమాచారం అందించారు. ఆ ప్రకారం వీఎంఆర్‌డీఏకు వాటిని అప్పగించాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆర్‌డీఓలు భూ సమీకరణ చేయాలని సూచించింది. అసైన్డ్ పట్టా ఉన్న రైతులకు ఎకరాకు 900 గజాలు, ఆ భూమిలో పదేళ్లకు పైగా ఆక్రమణలో ఉంటే 450 గజాలు అభివృద్ధి చేసిన భూమి ఇస్తారు. ల్యాండ్ పూలింగ్ కోసం 2016లో చేసిన చట్టం ప్రకారం ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది.

అభివృద్ధి, సంక్షేమానికి సముచిత ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా టీడీపీ కోసం పనిచేస్తున్న తనకు పార్టీ అధిష్ఠానం సముచితమైన పదవిని కట్టబెట్టిందని, మార్కెట్ యార్డు అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరా కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, పీఎసీఎస్ ఛైర్‌పర్సన్లు చిక్కాల శ్రీనివాసరావు, గెడ్డం కన్నబాబు, కొప్పిశెట్టి బుజ్జి, వేచలపు జనార్దన్, కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు, చింతలపు ప్రదీప్, వినోద్‌రాజు, యాళ్ల వరహాలు, ఉరుకుట్ల వెంకటరమణ, ఎం.రమాకుమారి, కొరిమి సూర్యగణేశ్, బత్తుల రమణబాబు, యాళ్ల చిరంజీవి, రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత దిగాలు

... 5వ పేజీ తరువాయి

లేకపోవడంతో పొలాలకు నీరు చేరడంలేదు. దీంతో ఆయా రైతులు చెరువుల ఆధారంగా వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఇంతవరకు భారీ వర్షాలు పడకపోవడంతో చెరువుల్లో నీరుచేరలేదు. 90 శాతానికిపైగా చెరువుల్లో ఒక్కచుక్క నీరు లేదంటే ఆశ్చర్యపడాల్సినపనిలేదు. మిగిలిన పది శాతం చెరువుల్లో కొద్దిపాటి నీరు చేరినప్పటికీ కాలువలకు ప్రవహించే పరిస్థితి లేదు. ఈ ఏడాది సకాలంలో సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుందన్న వాతావరణ శాఖ సమాచారంతో రైతులు ఈ నెల ఆరంభంలో నారుమడుల్లో వరి విత్తనాలు చల్లారు. అడపాదడపా కురుస్తున్న చెదురుమదురు వర్షాలతో నారు పెరిగింది. అయితే కొద్ది రోజుల నుంచి వర్షాలు లేకపోగా, ఎండ తీక్షణంగా కాస్తుండడంతో వరినారు మడులు నెర్రెలిచ్చి, ఎండిపోతున్నది. కొంతమంది రైతులు వ్యయప్రయాసలతో సమీపంలో వున్న వనరుల నుంచి నీటిని పెట్టుకుని వరి నారును కాపాడుకుంటున్నారు. అయితే చెరువుల్లో కనీసస్థాయిలో కూడా నీరు లేక పొలాలను దమ్ము చేసే పరిస్థితి లేకపోవడం, మరోవైపు వరినారు నాటడానికి సిద్ధంగా వుండడంతో ఏం చేయాలో రైతులకు పాలుపోవడంలేదు.

సెజ్ భూముల్లో గ్రావెల్ దందా

... 5వ పేజీ తరువాయి

రెవెన్యూ పరిధిలోని ఏషియన్ పెయింట్స్ కంపెనీ సమీపంలో, లాలంకోడూరు వద్ద పెప్సీ కంపెనీ సమీపంలో వున్న సెజ్ భూముల్లో రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వుతున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్ లారీలతో తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. దూరాన్నిబట్టి లారీ గ్రావెల్ రూ.8 వేల నుంచి రూ.10 వేలకు అమ్ముతున్నారు. రాత్రి పది గంటలకు తవ్వకాలు మొదలుపెట్టి, తెల్లవారుజామున ఐదు గంటలకు ఆపేస్తున్నారు. ఏపీఐఐసీ అధికారులు స్పందించి, గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోకపోతే సెజ్ భూముల్లో కృత్రిమ చెరువులు ఏర్పడతాయని స్థానికులు అంటున్నారు.

సరుగుడులో పర్యటించిన డీఎంహెచ్‌వో

» జ్వరాల నియంత్రణకు వైద్య శిబిరాలు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాతవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వైరల్ జ్వరాలు ప్రబలిన మండలంలోని సరుగుడు, వెన్నలపాలెం గ్రామాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి బుధవారం పర్యటించారు. 'సరుగుడు, వెన్నలపాలెం గ్రామాల్లో జ్వరాల విజృంభణ' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సరుగుడులో ఇన్‌చార్జ్ డాక్టర్ ప్రసన్న వైద్య సేవలు అందించి, జ్వర బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. గిరిజనులకు అందుతున్న వైద్య సేవల గురించి డీఎంహెచ్‌వో అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో మృతిచెందిన జైతి శివ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శివకు జ్వరం కాకుండా ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. సరుగుడు గ్రామంలో నాలుగు రోజులపాటు వైద్య శిబిరం కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పంచాయతీ సిబ్బందిని కోరారు. వెన్నలపాలెంలో కూడా వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు మందులు అందజేశారు. అనంతరం పి.జగ్గంపేట గ్రామానికి వెళ్లి జ్వరాల గురించి ఆరా తీశారు. నివాసాల చుట్టూ మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కోరారు. ఆమె వెంట జిల్లా మలేరియా అధికారి కె.వరహాలదొర వున్నారు.



సరుగుడులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డీఎంహెచ్ఓ పద్మావతి

చేతివృత్తుల పరిరక్షణకు జాతీయస్థాయి శిక్షణ

» జిల్లా నుంచి హాజరైన లక్ష్మీపురం స్కూల్ టీచర్ విశ్వనాథరాజు

» రాష్ట్రంలో చేతివృత్తి కళాకారుల స్థితిగతులపై ప్రాజెక్టు అందజేత

చోడవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేతివృత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంతో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణకు మండలంలోని లక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు గూడెపు విశ్వనాథరాజు హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా నుంచి ఇతను ఒక్కరే ఎంపిక కావడం విశేషం. దేశంలో అంతరించిపోతున్న చేతివృత్తులను భావితరాలు కాపాడుకునేలా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అధికారి రాహుల్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేతివృత్తి కళాకారుల జీవన స్థితిగతులపై రూపొందించిన ప్రాజెక్టును విశ్వనాథరాజు సమర్పించారు. ఈ సందర్భంగా రాహుల్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 9వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన ఈ శిక్షణలో వివిధ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన ఉపాధ్యాయులు హాజరయ్యారు.



భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అధికారి రాహుల్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న లక్ష్మీపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గూడెపు విశ్వనాథరాజు

ఎమ్మెల్సీ దృష్టికి టీచర్ల సమస్యలు

కొత్తూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుకు జిల్లాకు చెందిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యాయులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయనను బుధవారం విశాఖపట్నంలో కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. 2003 డీఎస్సీ వారికి ఓపీఎస్ అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆప్షనల్ హాలిడేస్‌ను పాఠశాల మొత్తానికి వర్తింపజేసే విధంగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో చర్చించాలని కోరారు. సింగిల్ టీచర్ల విషయంలో ఇబ్బంది కలగకుండా క్లస్టర్ టీచర్లను నియమించే విధంగా ప్రభుత్వంతో చర్చించాలని విజ్ఞప్తి చేశారు. హైస్కూల్ స్థాయిలో సబ్జెక్టు కాంప్లెక్స్‌లను క్లస్టర్ పరిధిలో కాకుండా మండల స్థాయిలో నిర్వహించేలా చూడాలన్నారు. ఈ విద్యాశక్తి కార్యక్రమాన్ని ఐచ్ఛికం చేయాలన్నారు. ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లను ఫుల్‌టైం ఇన్‌స్ట్రక్టర్లుగా మారుస్తూ వారి క్రమబద్ధీకరణకు ప్రయత్నం చేయాలని కోరారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిల్లో రూ.7 వేల కోట్లను కూటమి ప్రభుత్వం ఇవ్వడంలో ఆలస్యమవుతున్నదని, దీనిని పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనుబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వి.నూకేశ్, వరప్రసాద్, విద్యాసాగర్, రమా, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

బస్సులు కండిషన్‌లో ఉండేలా చర్యలు

» సిబ్బందికి డీపీటీవో ప్రవీణ ఆదేశం

అనకాపల్లి టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్న నేపథ్యంలో బస్సులన్నీ కండిషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆర్టీసీ డీపీటీవో వి.ప్రవీణ ఆదేశించారు. బుధవారం ఆమె అనకాపల్లి డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్యారేజిలోని సిబ్బందితో మాట్లాడారు. బస్సుల్లో ఎటువంటి సాంకేతిక లోపాలు చోటు చేసుకోకూడదని, బస్సులు కండిషన్‌లో ఉండేలా సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా కండిషన్‌లో ఉన్న బస్సుపై రోడ్డు టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం జీవీ గౌరి, తదితరులు పాల్గొన్నారు.



గ్యారేజి సిబ్బందితో మాట్లాడుతున్న డీపీటీవో ప్రవీణ

కానరాని శతాబ్ది సందడి

» వందో వసంతంలోకి ఏయూ

» ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ వేడుకలు నిర్వహిస్తామంటూ అధికారుల ప్రకటన

» వందేళ్ల వేడుకలకు గుర్తుగా ఏదైనా నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రణాళిక

» కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయం

» మూడు నెలల క్రితం ఉత్సవాలు ప్రారంభం

» ఆ తరువాత ఆ ఊసే లేదు

» దేశ, విదేశాల్లో కీలక స్థానాల్లో పూర్వ విద్యార్థులు

» వారిని సమన్వయపరిచే యంత్రాంగమే లేదు



విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శతాబ్ది ఉత్సవాల సందడేమీ కనిపించడం లేదు. దేశంలోని పురాతన విద్యా సంస్థల్లో ఒకటైన ఏయూ వందో ఏడాదిలోకి ప్రవేశించడంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ వేడుకలను నిర్వహిస్తామంటూ అధికారులు ప్రకటించారు. వేడుకలకు గుర్తుగా ఏదైనా గొప్ప కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఇందుకోసం దాతలు, పూర్వ విద్యార్థుల సహకారాన్ని తీసుకుంటామన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీలో మాదిరిగా నూతన భవనాన్ని నిర్మిస్తే బాగుంటుందని పలువురు మాజీ వీసీలు సలహా ఇవ్వడంతో, ఆ మేరకు వర్సిటీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అదేవిధంగా వర్సిటీ భవిష్యత్తు అవసరాలకు భారీమొత్తంలో నిధులు సేకరించి కార్పస్ ఫండ్ ఏర్పాటుచేయాలని భావించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వాల నుంచి ఆర్థిక సాయం ఆశించిన స్థాయిలో లభించే అవకాశాలు ఉండవని, కార్పస్ ఫండ్ ద్వారా వచ్చే వడ్డీతో వర్సిటీ అవసరాలు తీర్చుకోవచ్చునని అధికారులు ఆలోచించారు. నిధులు సమీకరించే ప్రక్రియను వందేళ్ల వేడుకలతోనే ప్రారంభించాలనుకున్నారు. అయితే, ఈ రెండు కీలక నిర్ణయాలకు సంబంధించి ఇప్పటివరకూ ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. వందేళ్ల వేడుకలు ప్రారంభమై దాదాపు మూడు నెలలు కావస్తోంది. ఇప్పటివరకూ ఎటువంటి పెద్ద కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించలేదు.

బాధ్యత ఎవరిది?

ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు వేలాది మంది ఉన్నారు. అందులో పలువురు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అయితే, వారిని కో-ఆర్డినేట్ చేసుకుంటూ నిధులు సమీకరించే దిశగా వేదికను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆంధ్ర మెడికల్ కళాశాల అధికారులు వందేళ్ల వేడుకలకు ఏడాది ముందుగానే కమిటీలను ఏర్పాటు చేసుకుని నిధులను సమీకరించుకుని రూ.50 కోట్లతో సువిశాలమైన భవనాన్ని నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో ఏయూ అధికారులు కూడా ఆ దిశగా ఆలోచించాలని సూచిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సంఘంతో సమన్వయం కరవు

ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం (ఏఏఏ)లో జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు సహా ఎంతోమంది ప్రముఖులు ఉన్నారు. అటువంటి వారి సహాయాన్ని తీసుకుని వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలి. అయితే, ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో పూర్వ విద్యార్థుల సంఘం కూడా అంటీ ముట్టనట్టుగానే ఉంటోంది. ఏటా డిసెంబరు పదో తేదీన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలను జీఎంఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దేశంలోని ప్రముఖులను తీసుకుని వస్తున్నారు. ఈ వేడుకలకు రతన్ టాటా, ఎల్అండ్‌టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఏడాది రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీని తీసుకురావాలని జీఎంఆర్ భావించారు. ఈ మేరకు వర్సిటీ అధికారులకు సమాచారాన్ని అందించారు. అయితే, వందేళ్ల వేడుకల్లో బిజీగా ఉంటామని తెలియజేయడంతో ఆయన ఆ ఆలోచనను విరమించుకున్నట్టు తెలిసింది. ప్రస్తుత పరిణామాల పట్ల ఏయూ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాంపస్‌లో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్న వాతావరణం కాన రావడం లేదంటూ పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా వర్సిటీ అధికారులు వందేళ్ల వేడుకలపై దృష్టిసారిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

క్రైం... crime news

పరవాడలో పట్టపగలు చోరీ

» అర తులం బంగారం, రూ.60 వేల నగదు అపహరణ

పరవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ పరదేశిమాంబ ఆలయ సమీపంలో గల ఓ ఇంట్లో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. బీరువాలోని అర తులం బంగారం చెవిపోగులతో పాటు రూ.60 వేల నగదు, ల్యాప్‌టాప్ బాగ్ అపహరణకు గురయ్యాయి. దీనికి సంబంధించి పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ గ్రామానికి చెందిన రెడ్డి అప్పారావు పైడమ్మ దంపతులతో పాటు కుమారుడు శివ కలిసి ఉంటున్నారు. శివ ఫార్మాసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తుండగా, తల్లిదండ్రులిద్దరూ పొలం పనికి వెళ్లిపోతారు. ఎప్పటిలాగే మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు శివ డ్యూటీకి వెళ్లిపోగా తల్లిదండ్రులు ఇద్దరూ పొలానికి వెళ్లిపోయారు. వెళ్లే ముందు ఇంటి తాళాలను షూరాక్‌లో పెట్టి దానిపై కవరు మూసి ఉంచారు. తిరిగి రాత్రి ఏడు గంటలకు తల్లిదండ్రులు ఇంటికి చేరుకున్నారు. షూరాక్‌పై ఉంచిన కవరు లేకపోవడాన్ని గుర్తించారు. యథావిధిగా తాళాలు తీసి లోపలికి వెళ్లిపోయారు. అప్పటికి దొంగతనం జరిగినట్టు వాళ్లు గుర్తించలేకపోయారు. కుమారుడు డ్యూటీ నుంచి రాత్రి ఇంటికి తొమ్మిది గంటలకు చేరుకున్నాడు. బ్యాగ్ లేకుండా ఖాళీగా ఉన్న ల్యాప్‌టాప్‌ను గుర్తించాడు. బ్యాగ్ ఏమైందని తల్లిదండ్రులకు అడుగగా, తమకు తెలియదని సమాధానమిచ్చారు. షూరాక్‌పై మూసి ఉంచిన కవరు లేదనే విషయాన్ని కుమారుడికి చెప్పారు. దీంతో అనుమానం వచ్చి బీరువాను తెరిచి చూడగా, అందులో అర తులం బంగారం చెవిపోగులతో పాటు రూ.60 వేల నగదు దొంగతనానికి గురైనట్టు నిర్ధారించుకున్నారు. మంగళవారం రాత్రి పది గంటలకు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. గత మంగళవారం కూడా పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద ఇదే తరహాలో దొంగతనం జరిగిన సంగతి తెలిసిందే. ఈ రెండు దొంగతనాలకు పాల్పడింది ఒక్కరే అయి ఉండొచ్చునని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



శ్యామ్(ఫైల్ ఫొటో)

పరవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యంపై కుటుంబసభ్యులు బుధవారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన శ్యామ్‌మాజీ(45) కుటుంబసభ్యులతో కలిసి లంకెలపాలెం దాసరివీధిలో నివాసముంటున్నారు. ఆయన గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయారు. ఈ నెల 22న ఉదయం తొమ్మిది గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో అతని కుమారుడు అభిరామ్ బుధవారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

చెర్లోపల్లి రైతులు ఖుషీ!

... 5వ పేజీ తరువాయి

వుడా, రైతుల మధ్య ఒప్పందం జరిగింది. లేఅవుట్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. అంతర్గత రహదారుల నిర్మాణం కూడా జరిగింది. దీనికి అదనంగా మరో 23 ఎకరాలను వుడా అధికారులు సేకరించారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఎకరా ధర రూ.40 వేలుగా నిర్ధారించి, నష్టపరిహారం చెల్లిస్తామని అధికారులు చెప్పారు. ఇందుకు రైతులు ససేమిరా అన్నారు. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.3-4 లక్షలు పలుకుతున్నదని, ఆ ప్రకారం పరిహారం చెల్లించాలని పట్టుబట్టారు. అయినప్పటికీ వుడా అధికారులు భూములు తీసేసుకుని, రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం సొమ్మును న్యాయస్థానంలో జమచేశారు. అనంతరం వుడా అధికారులు ఇక్కడ లేఅవుట్ అభివృద్ధిని అర్ధంతరంగా ఆపేశారు. వుడాతో ఒప్పందం చేసుకున్న రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కుటుంబ అవసరాలకు భూమిని అమ్ముకునే వీలు లేకపోయింది. మరోవైపు ఇక్కడ భూముల విలువ గణనీయంగా పెరిగింది. లేఅవుట్‌ను అభివృద్ధి చేసి స్థలాలు అప్పగించాలని, లేదంటే ఒప్పందాలను రద్దు చేసుకుని తమ భూములను వెనక్కు వచ్చేయాలని స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా రైతులు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. కానీ వుడా అధికారులు పట్టించుకోలేదు. చెర్లోపలి లేఅవుట్‌కు భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలంటూ మాజీ మంత్రి దాడి వీరభద్రరావు 2023 సెప్టెంబరులో వీఎంఆర్‌డీఏ అధికారులకు లేఖ రాశారు. దీనికి సానుకూలంగా స్పందించారే తప్ప, ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, చెర్లోపలి ఖండంలో వుడా సమీకరించిన భూముల సమస్యపై దృష్టి సారించారు. చెర్లోపలి ఖండంలో లేఅవుట్ కోసం సమీకరించిన 58.18 ఎకరాలను అభివృద్ధి చేయాలని, పక్కనే గతంలో సేకరించిన 23 ఎకరాల సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అజెండాలో ఈ అంశాన్ని పొందుపరిచి, ఆమోదం తెలిపారు. చెర్లోపలి ఖండంలోని 58.18 ఎకరాలను లేఅవుట్‌గా అభివృద్ధి చేయడానికి పరిపాలనాపరమైన ఆమోదం తెలుపుతూ మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ బుధవారం జీవో నంబర్ 145ను విడుదల చేశారు. రైతులతో గతంలో కుదుర్చుకున్న ఒప్పంద ప్రకారం ఎకరాకు 1,800 గజాల చొప్పున అభివృద్ధి చేసిన స్థలాన్ని రైతులకు ఇస్తారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆయా రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఫార్మాసిటీలో వ్యర్థాల గుట్టలు

... 5వ పేజీ తరువాయి

తరలించి, ఆ తరువాత కొత్త వ్యర్థాలు తీసుకోవాలి. కానీ యాజమాన్యం అలా చేయడం లేదు. పక్కనే ఏపీఐఐసీకి చెందిన 50 ఎకరాల స్థలం ఉంటే అందులో 20 ఎకరాలను వ్యర్థాల డంపింగ్‌కు వాడుకుంటోంది. అక్కడ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిల్వ చేయడం, పరిశ్రమల నుంచే బూడిద వంటి వ్యర్థాలను బయట నిల్వ చేయడం వల్ల గాలి, నీరు కలుషితమవుతున్నాయి. వ్యర్థ రసాయనాలను స్థానిక చెరువులు, గెడ్డలోకి అనధికారికంగా విడిచిపెడుతోంది. వీటిపై ఫిర్యాదులు అందడంతో ఏపీ పీసీబీ అధికారులు ఈ నెలలోనే నాలుగుసార్లు (12, 13, 17, 18 తేదీల్లో) తనిఖీలు చేశారు. అనేక లోపాలు గుర్తించారు. నిబంధనలు పాటించడం లేదని తేల్చారు. నోటీసులు జారీచేశారు. ల్యాండ్ ఫిల్ పాండ్‌లో వ్యర్థాలను తరలించేంత వరకు కొత్త వ్యర్థాలను తీసుకురాకూడదని హెచ్చరించారు. నిల్వ చేసిన వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. బూడిద నిల్వలపై టార్పాలిన్లు కప్పాలని, గాలికి ఎగరకుండా చూడాలని సూచించారు. అక్కడి వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటులోకి వచ్చే వాహనాలను శుభ్రం చేసేందుకు శాశ్వత ఏర్పాట్లు లేకపోవడాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనపై వివరణ ఇవ్వాలని నోటీసు జారీచేశారు. ఆ తరువాత యాజమాన్యాన్ని విచారణకు పిలిచి, ప్రభుత్వానికి నివేదిక పంపించి, తగిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

ఎన్‌జీటీలో కేసు

విశాఖ ఫార్మా సిటీ కాలుష్యంపై స్థానిక ప్రజా సంఘాలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో కేసు వేశాయి. తానాం గ్రీన్ బెల్ట్‌లోని బఫర్ జోన్‌లో చెరువు తవ్వారని, అది నిబంధనలకు వ్యతిరేకమని ఆరోపించాయి. పరిశ్రమల రసాయన వ్యర్థాలను పరవాడలోని మొల్లేటి గెడ్డలోకి విడిచి పెడుతున్నారని, దానివల్ల తాగునీరు కలుషితం అవుతోందని ఫిర్యాదు చేశారు. తాడి గ్రామంలోని ల్యాండ్ ఫిల్ (వ్యర్థాలు నిల్వ చేసే పాండ్) పూర్తిగా నిండిపోయిందని, అనధికారికంగా నిల్వ చేస్తున్నారని పేర్కొన్నారు.

వీటన్నింటిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఏపీపీసీబీని ఎన్‌జీటీ ఆదేశించింది. అధికారులు నివేదిక సమర్పించగా, దానిపై ప్రస్తుతం వాదనలు జరుగుతున్నాయి. ఎన్‌జీటీలో కేసు ఉన్నా సరే విశాఖ ఫార్మా సిటీ యాజమాన్యం ఇప్పటికీ అవే తప్పులు చేయడం లెక్కలేనితనాన్ని రుజువు చేస్తున్నదని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459